

సహకార సంఘాల్లో.. బ్యాంకు సేవలు



- త్వరలో 100 శాతం కంప్యూటరీకరణ
- గుంతలు లేని రహదారులకు చర్యలు
- జిల్లాలో పరిశ్రమలకు అనువైన వాతావరణం
- 200 రోజుల కార్యాచరణపై 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణ పూర్తి చేస్తున్నాం. ఇప్పటివరకు 60 సొసైటీల కంప్యూటరైజేషన్ పూర్తి అయింది. మిగిలిన మూడు సొసైటీలు వచ్చే వారంలో పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని అధిగమిస్తాం. దాంతో అవన్నీ కోర్ బ్యాంకింగ్ విధానంలోకి వస్తాయి. సొసైటీల్లో నిధుల దుర్వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది. కంప్యూటరీకరణ పూర్తి అయితే జిల్లాలోని 63 పీఏసీఎస్‌లు బ్యాంకుల తరహాలో సేవలందిస్తాయి.. అని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు సంబంధించి 200 రోజుల కార్యాచరణ ప్రణాళికని రూపొందించి లక్ష్య సాధన దిశగా చర్యలు చేపట్టామని 'ఆంధ్రజ్యోతి'తో ఆమె చెప్పారు. కోర్ బ్యాంకింగ్ నూతన విధానం వల్ల ప్రత్తిపాడు మండలం పెదమల్లాయపాలెం గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్(ఎంపీఎఫ్‌సీ) నిర్మాణాన్ని ప్రారంభించామని, డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. పెద్ద కంపెనీలు రానందున నాస్కామ్, సీడాప్ ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దానికి 120 కంపెనీలు హాజరయ్యేలా చూసి కనీసం వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నాం. జిల్లాలోని ఎనిమిది స్కిల్ హబ్‌లు, ఒక స్కిల్ కాలేజ్, స్కిల్ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇప్పించి ఇంటర్వ్యూలకు సిద్ధం చేస్తున్నాం. మంగళగిరిలో పైలెట్ ప్రాజెక్టుగా స్కిల్ సెన్సస్ నిర్వహించి అక్కడి ప్రజల అవసరాలు తెలుసుకున్నాం. అందుకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

అంగన్‌వాడీల రూపురేఖల మార్పు

జిల్లాలో 200 అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చే పనులను చేపట్టాం. తాగునీరు, టాయ్‌లెట్, విద్యుత్ సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాం. సీఆర్‌డీఏ పరిధిలో కురగల్లు, బేతపూడి, నీరుకొండ, నవులూరులో కొత్త అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టాం. వీటికి సంబంధించి ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు.

రూ.కోటితో ప్యాచ్‌వర్కులు

కొత్త సంవత్సరం నాటికి రోడ్లపై గుంతలు అనేవి లేకుండా చేసే పనులు ప్రారంభించాం. స్టేట్ హైవే రోడ్లు 39.17 కిలోమీటర్ల పొడవునా గుంతలు పూడ్చేందుకు రూ.కోటితో ప్యాచ్‌వర్కులు చేపట్టాం. అలానే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు సంబంధించి 37.729 కిలోమీటర్ల పొడవునా పాట్‌హోల్స్ పూడ్చేందుకు రూ.1.26 కోట్లు విడుదల చేసి పనులు పూర్తిచేస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

క్రీడలకు ప్రాధాన్యం

ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బీఆర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ ఫోమ్ పిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖేలో ఇండియా ప్రోగ్రాం కింద బీఆర్ స్టేడియం సమూల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతున్నది. బీఆర్ స్టేడియం పక్కనే ఉన్న ఐదు ఎకరాల చెరువుని పూడుస్తున్నాం. ఇండోర్ స్టేడియం షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో లైటింగ్, పెయింటింగ్ పనులు మొదలయ్యాయి. స్టేడి యం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచామని కలెక్టర్ చెప్పారు. బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న కోడిగుడ్డు సత్రంలో ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్ కాంప్లెక్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులకు రూ.30 లక్షలు విడుదల చేశాం. ఫినిషింగ్‌కు రూ.1.50 కోట్ల నిధులు అవసరమౌతాయి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఒక మంచి హాస్టల్‌ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

జిల్లాలో పలుచోట్ల విలువైన వక్ఫ్ ఆస్తులున్నాయి. లాలాపేట పెద్దమసీదుకు చెందిన 244.34 ఎకరాల భూమి నగర శివారులో (మిగతా 6వ పేజీలో..)



కరెంట్‌కూ.. రీచార్జి

రీచార్జి చేస్తేనే సెల్‌ఫోన్ పని చేస్తుంది.. లేదంటే ఎవరికైనా ఫోన్ చేయాలంటే కుదరదు.. ఇదే తరహాలో ఇక విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పుడు విద్యుత్ కనెక్షన్లకు ఉన్న మీటర్లను మార్చేస్తున్నారు. వాటి స్థానంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో స్మార్ట్‌మీటర్లను బిగించేశారు. వ్యాపార దుకాణాల్లో మీటర్లను మారుస్తున్నారు. ఆ తర్వాత పరిశ్రమలు, గృహాలకు మార్చనున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను జూలై 2025 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ మోటార్లకు మాత్రం స్మార్ట్‌మీటర్ల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ విధానంలో ఇక విద్యుత్ బకాయిలు పేరుకుపోవు.. ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు రానున్నాయి.

మొబైల్ అనుసంధానం

స్మార్ట్ మీటర్లకు వినియోగదారుడి మొబైల్‌ను అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు తన మొబైల్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా ఎంత మొత్తం కావాలంటే అంత నగదు రీచార్జి చేసుకోవాలి. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది.. ఎంత రీచార్జి చేశారు.. ఎప్పుడు రీచార్జి గడువు ముగిస్తుంది.. వంటి సమగ్ర వివరాలు మొబైల్‌లోనే తెలుసుకోవచ్చు. రీచార్జి గడువు ముగిసే సమాచారం వినియోగదారుడి సెల్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది.

- ముందుగా నగదు చెల్లిస్తేనే సరఫరా
- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం
- ఇప్పటికే వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి
- వ్యాపార దుకాణాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న వైనం
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 36,777 మీటర్ల ఏర్పాటు
- అన్ని కేటగిరీలకు తప్పనసరి.. వ్యవసాయ మోటార్లకు మినహాయింపు
- జూలై 2025 లోపు స్మార్ట్ మీటర్ల బిగింపు పూర్తి చేయాలని లక్ష్యం



నరసరావుపేటలోని టీ స్టాల్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగంలో ఇక సాంకేతికత రానున్నది. మొబైల్ రీచార్జి తరహాలోనే విద్యుత్ సరఫరా వినియోగంలోకి రానున్నది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే 36,777 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. వ్యాపార షాపుల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో వ్యాపార దుకాణాల్లో మీటర్ల ఏర్పాటు పూర్తి కానున్నది. తదుపరి దశలో పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య.. పరిశ్రమల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో ఇంటికి రీడింగ్ బిల్లు రావడం.. దానిని కట్టడం ఇక ఉండవు. వినియోగదారులు ఎంత మొత్తం రీచార్జి చేసుకుంటే ఆ మొత్తం అయిపోయే వరకు కరెంట్ సరఫరా ఉంటుంది. చెల్లించిన మొత్తం పూర్తయిన తర్వాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చొని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్‌ఫోన్లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని (మిగతా 6వ పేజీలో..)

జిల్లా	బిగించిన మీటర్లు
పల్నాడు	10,668
గుంటూరు	15,349
బాపట్ల	10,760

రాజ్యసభ రేసులో.. గల్లా జయదేవ్

- అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎంపీ పేరు
- గత ఎన్నికల్లో పోటీకి దూరమైనా పార్టీపై విధేయత



గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అడుగు పెట్టాలని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఉత్సాహ పడుతున్నారు. ఖాళీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీటు ఆశిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించిన జయదేవ్ మూడో పర్యాయం బరిలో నుంచి తప్పుకున్నారు. లోక్‌సభ సభ్యుడిగా ఉండి తనకున్న వ్యాపారాల మూలంగా ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నాననే భావనతో పాటు అప్పటి సీఎం జగన్ వేధింపుల నేపథ్యంలో రాజకీయాలంటేనే విరక్తి చెందారు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో డాక్టర్ పెమ్మసానికి పోటీ చేసే అవకాశం లభించగా ఆయన గెలుపును కాంక్షిస్తూ కుటుంబ సమేతంగా గల్లా వచ్చి ఓటు కూడా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు మంత్రి నారా లోకేశ్‌తో కూడా గతంలో లాగే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో అడుగుపెట్టాలనే ఆకాంక్షను ఆయన ఇప్పటికే చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వివాద రహితుడు, నిజాయితీ పరుడైన జయదేవ్ అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే కూటమిలో టీడీపీతో పాటు మరో రెండు పార్టీలు ఉన్నందున అటు పార్టీ, కుల సమీకరణలు బేరీజు వేసుకుంటూ రాజ్యసభ అభ్యర్థిత్వాలపై సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు.

అమ్మో.. ఫెంగల్



కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద ఆరబోసిన ధాన్యాన్ని పట్టాలు కప్పుకునేందుకు గుట్టగా చేస్తున్న రైతులు

- తుఫాన్ ప్రభావం.. రైతుల్లో ఆందోళన
- ముప్పులేదన్నా ఈదురు గాలులు.. వర్షం
- కల్లాల్లో, రోడ్లపైన ధాన్యాన్ని తరలిస్తోన్న అన్నదాతలు
- మూడో రోజు హార్బర్‌లో ఒకటో నెంబరు ప్రమాద సూచిక
- చేతికొచ్చిన పంట నోటికందదేమోనని భయపడుతున్న రైతులు



తెనాలి: జంపని దగ్గర హడావుడిగా కుప్పలు వేస్తున్న కూలీలు



తెనాలి: పెదరావూరు దగ్గర నేలవాలిన వరిచేను



కొల్లూరు: లారీకి లోడు చేసేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు



కొల్లిపర మండలం చక్రాయపాలెంలో ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు



దుగ్గిరాల: మంచికలపూడి వద్ద నేలకొరిగిన వరిపంట

తెనాలి, కొల్లిపర, గుంటూరు సిటీ, బాపట్ల, రేపల్లె, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు, అమృతలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి తీవ్ర తుఫాన్‌గా మారింది. ఫెంగల్ పేరుతో దూసుకొస్తోన్న తుఫాన్ బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలపై ప్రభావం చూప దని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే బాపట్ల జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో అలలు చిన్నపాటి స్థాయిలో పైకి వస్తున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్న హెచ్చరికలతో పడవలన్నీ ఒడ్డునే ఉన్నాయి. బాపట్ల, గుంటూరు జిల్లా ల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘా వృతమైంది. తుఫాన్ ప్రభావంతో చలిగాలులు పగటి వేళల్లో కూడా ఎక్కువగా వీస్తున్నాయి. ఇక బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడ్డాయి. కోతకోసి ఆరబోసి రోడ్లపై, కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని వర్షం తడిపేసింది. రెండు రోజులుగా వాతావరణం ఎండ, మబ్బులతో దోబూచులాడుతున్నా వర్షం పడదన్న ధైర్యంతో రైతులు వరి కోతలు కోస్తున్న, ఇప్పటికే కోసిన వారు తుఫాన్ ప్రభావంతో వణికిపోతున్నారు. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వర్షంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షం పడదన్న భరోసాతో ఉన్న రైతులను వర్షం నష్టపరిచింది. కొందరు ధాన్యపు రాశులపై పట్టాలు కప్పేసుకోగా మరికొందరు గోతాలకెత్తి మిల్లులకు తోలేందుకు సిద్ధమయ్యారు. కోత కోయకుండా ఉంచిన పైరు గాలులకు చాలాచోట్ల నేలవాలింది. కొల్లూరు మండలంలో 8 వేల ఎకరాల్లో సాగు చేయగా 1500 ఎకరాల్లో మాత్రమే వరికోతలయ్యాయి. భట్టిప్రోలు మండలంలో పది వేల ఎకరాల వరి సాగు చేపట్టగా, రెండు రోజులుగా కేవలం 500 ఎకరాల్లో మాత్రమే రైతులు కోతలు కోశారు. రేపల్లె నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలపైనే వరి సాగు చెయ్యగా 10 వేల ఎకరాల్లో కోతలయ్యాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టవానిపాలెం మండలాల్లో 53వేల ఎకరాల్లో వరిసాగవగా 30శాతం పైర్లు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో చిరుజల్లులతో పంట నేలవాలి గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుందని హెచ్చరికలు జారి చేయడంతో అన్నదాతలు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో వచ్చిన వరదల వల్ల ఒకసారి నష్టపోయామని ఇప్పుడు వర్షాలు పడితే సొంతం మునగడం ఖాయమని రైతులు వాపోతున్నారు. తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో మూడో రోజైన శుక్రవారం ఒకటో నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది. సముద్రం కల్లోలంగా ఉండటంతో భయాందోళనతో వారం క్రితం వేటకు వెళ్లిన బోట్లన్నీ సురక్షితంగా హార్బర్‌కు చేరుకున్నాయి.

యంత్రాలకు డిమాండ్

ముసురు నేపథ్యంలో నూర్పిడి యంత్రాలకు డిమాండ్ పెరిగింది. గతంలో ఎకరాకు తీసుకునే మొత్తం కంటే ఎకాఎకిన రూ.800వరకు పెంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షం పడితే మొత్తానికే నష్టపోతామనే బెంగతో రైతులు భారమవుతున్నా సరే లెక్క చేయకుండా కోతలు కోయిస్తున్నారు. వాతావరణ పరిస్థితి దృష్టిలో ఉంచుకుని చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు యంత్రాలతో రాత్రివేళల్లో సైతం పంటను కోత కోయించి ధాన్యాన్ని కొందరు భద్రపరుస్తున్నారు. రేపల్లె నియోజకవర్గంలో మధ్యాహ్నం నుంచి ఈదు రుగాలులతో కూడిన వర్షంపడటంతో పైర్లు నేలవాలాయి. చెదురుమదురు గాలులతో నేలవాలిన పైర్ల ను కట్టులు కట్టేపనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వరి కోయవద్దు

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రెండు, మూడు రోజుల పాటు వరి కోతలు కోయకుండా ఉండటం మంచిదని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. కోత కోసిన తర్వాత వర్షం కురిస్తే ధాన్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు కోత కోసిన ధాన్యం చాలా వరకు అమ్మకాలు జరిగాయన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




సమర్థుడైన మన్నవకు.. సరైన పదవి
కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

అయ్యప్ప స్వాములకి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు
శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు


తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయండి
నేర సమీక్షలో ఎస్పీ సతీష్ కుమార్

6



ఎలర్జీలపై నేడు, రేపు జాతీయ సదస్సు

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చినకాకాని ఎన్నారై మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో శని, ఆదివారాల్లో ఎలర్జీలపై జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ జరుగుతుందని సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందన్నారు. మారుతున్న వాతావరణం, పెరుగుతున్న కాలుష్యం కారణంగా దేశంలో ఎంతో మంది ఎలర్జీలు, సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని చెప్పారు. పిల్లలకు సంబంధించిన ఎలర్జీలపై నూతన వ్యాధి నిర్ధారణ పరిశోధనలు, పరీక్షలు, చికిత్సా విధానాల మీద సదస్సులో చర్చిస్తామన్నారు. జాతీయ పిల్లల ఎలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్ నాయక్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.


డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్

వాకా అంజిరెడ్డికి డాక్టరేట్

గుంటూరు(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని సిల్ చార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరిశోధన చేసినందుకు గుంటూరుకు చెందిన వాకా అంజిరెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ బాదల్ సోని పరిశోధన పర్యవేక్షణలో 'డీప్ లెర్నింగ్ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ కనుగొనడం' అనే అంశంపై అంజిరెడ్డి పరిశోధన చేశారు. 22వ స్నాతకోత్సవంలో అంజిరెడ్డికి డాక్టర్ రెడ్డి పట్టాను అందించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, బంధువులు అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం డాక్టర్ అంజిరెడ్డి వాకా లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయనగరంలో ప్రొఫెసర్, పరిశోధన, అభివృద్ధి విభాగంలో మెంబర్‌గా పని చేస్తున్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న వాకా అంజిరెడ్డి

స్టెప్ సీఈవోగా చంద్రముని

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టెప్ సీఈవోగా చంద్రముని రంగాలని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రంగయ్యని పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగంలో నియమించింది. ఎక్సైజ్‌లో అసిస్టెంట్ సెక్రెటరీ(సర్వీసెస్) హోదాలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పెంచల ప్రభాకర్‌ని ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్‌డీసీ(అడ్మిన్)గా నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యప్ప స్వాములకి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

- శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సిద్ధమైంది. అయ్యప్ప స్వాములకు స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి అదనపు ఆదాయం కోసం టూర్ ప్యాకేజీలతో అందుబాటులో ఉంచుతున్నారు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములు ఒక బృందంగా చేరి 30 మంది స్వాములు ఉంటే వారికి ప్రత్యేక బస్సు సిద్ధం చేస్తామని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో నుంచి పది కిలో మీటర్ల దూరంలో ఎక్కడికైనా బస్సును అయ్యప్పస్వాముల వద్దకు పంపిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న బస్సుతోపాటు సుశిక్షితులైన డ్రైవర్‌లను యాత్ర బస్సులకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గుంటూరు నుంచి బయల్దేరి..

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు నుంచి బయల్దేరి నేరుగా కాణిపాకం, అరుణాచలం, పళని, ఈషా టెంపుల్, గురు వాయుర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం అనంతరం తిరుగు పయనంలో త్రివేండ్రమ్, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తిరుచంధుర్, శ్రీరంగం, శివకంచి, విష్ణు కంచి, శ్రీకాళహస్తి మొదలైన పుణ్య క్షేత్రాలను దర్శించుకుని గుంటూరు చేరుకుంటుంది. అయ్యప్ప స్వాముల కోరిక మేరకు సూపర్ లగ్జరీ (2+2)పుష్ బ్యాక్, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. స్వాముల కోరినటువంటి క్షేత్రాలకు బస్సులు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్యాకేజీ ధరలు

అయ్యప్ప స్వాములకు టూర్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఏడు రోజుల టూర్‌కు ప్యాకేజీ బస్సుకు రూ. 2,49,000 కాగా 10 రోజుల టూర్ ప్యాకేజీ రూ. 2,85,000, 12 రోజుల టూర్‌కి రూ. 3,34,000, అలానే అల్ట్రా డీలక్స్ బస్సుకి ఏడు రోజుల టూర్‌కి రూ.2,65,000, అదే పది రోజుల టూర్‌కి రూ. 3,0,2000 కాగా 12 రోజుల టూర్‌కి రూ.3,55,000 తెలిపారు.

తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయండి

- తరచూ నేరాలకు పాల్పడే 10 మంది జాబితాను రూపొందించండి
- రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాలు సేకరించండి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్


జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన అక్టోబరు నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళలు, పిల్లలు, తీవ్ర నేరాలు, వ్యక్తుల అదృశ్యం, ఆధారాలు తెలియని మరణాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 'మహిళా.. మీ కోసం' కార్యక్రమం ద్వారా మహిళలు, ఆడ పిల్లల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో కేసులకు సంబంధించి త్వరగా ఛార్జిషీట్, పెండింగు దస్త్రాల దాఖలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ నేరాలకు పాల్పడే 10 మంది నిందితుల జాబితాను రూపొందించి వారి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుండాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాల సేకరించాలన్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు నిందితులకు శిక్షలు వేయించడంలో చొరవ చూపాలన్నారు. ఛార్జిషీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో, రేప్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా చేయాలని అన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించవద్దన్నారు. చోరీ కేసుల్లో నిందితులను పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. సఖి (వన్ స్టాప్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రొటెక్షన్) న్యాయవాది విజయలక్ష్మి సఖి తరుపున మహిళలకు అందించే సేవలను వివరించారు.

రివార్డులు, ప్రశంసాపత్రాలు

జిల్లాలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. వాటిని అందుకున్న వారిలో తెనాలి డీఎస్పీ జనార్ధన్ రావు, , సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, నగరంపాలెం సీఐ వీరా నాయక్, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, తెనాలి రూరల్ ఎస్సై ప్రతాప్ కుమార్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కుమార్, పట్టాభిపురం స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్ల ఫణిరాజు, నాగేశ్వరరావు, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ వీర్ల అంకయ్య తదితరులు ఉన్నారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు ఇచ్చిన సమాచారంతో గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నందుకుగానూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, రవిబాబు, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌కూ.. రీచార్జి

(5 పేజీ తరువాయి)

అందులో తమ సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తమకున్న విద్యుత్ సర్వీసుకు రీచార్జి చేసుకునే సౌకర్యం ఉంటుంది. దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదు. స్మార్ట్ మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో లక్షల మేర మీటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయం మినహా అన్ని కేటగిరి సర్వీసులకు మీటర్లు బిగింపు తప్పని సరి చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన

విద్యుత్ వినియోగం 200 యూనిట్లకుపైగా ఉన్న గృహ వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు పూర్తయిన వెంటనే గృహాలకు మీటర్ల బిగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. మీటర్ల బిగింపు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు.. అధిక బిల్లు తదితరాలపై వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూలై నుంచి స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించినా దానిని యాక్టివేట్ చేయలేదని చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెనువెంటనే రీచార్జి విధానం అమల్లోకి రానున్నది.

విద్యుత్ చోరీకి చెక్

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యం కూడా తెలిసిపోతుంది. ఎక్కడ విద్యుత్‌చౌర్యం జరుగుతుందో గుర్తించే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. 11 కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గత నియంత్రికల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంత విద్యుత్ సరఫరా అవుతోంది, వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నమోదవుతుంది. ఫీడర్ నియంత్రికలపై హెచ్చు, తగ్గుల సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

మిర్చియార్డులో కాటాదారుల పరేడ్


మిర్చియార్డులో వేమెన్‌ల పరేడ్‌లో సెక్రెటరీ ఆంజనేయులు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కాటాదారు(వేమెన్)ల పరేడ్‌ని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆదేశాల మేరకు శుక్రవారం యార్డు పరిపాలన భవనంలో సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు ఈ తనిఖీని నిర్వహించారు. మొత్తం 108 మంది కాటాదారులకు 86 మంది హాజరయ్యారు. మిగతా 22 మంది వేర్వేరు కారణాలను పేర్కొంటూ గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్రెటరీ ఆంజనేయులు మాట్లాడుతూ సోమవారం నుంచి కాటాదారులంతా నిర్ణీత సమయానికి డ్రస్‌కోడ్, ఐడీ కార్డులు ధరించి హాజరు కావాలన్నారు. ఎవరి పేరు మీద అయితే లైసెన్సు ఉందో వాళ్లే విధులకు హాజరై కాటాలు వేసి చీటీలు ఇవ్వాలని స్పష్టం చేశారు. తాము ప్రతి ఒక్క లైసెన్స్‌ని తనిఖీ చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సుదారు స్థానంలో వేరే వాళ్లు ఉంటే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైతే గైర్హాజరయ్యారో వారంతా సోమవారం యార్డు పరిపాలన భవనానికి రావాలని ఆదేశించారు. ఈనామ్ పద్ధతిలో ట్రేడింగ్ జరిగిన మిరపకాయలను కాటా వేయాలన్నారు.

ఆటోని సీజ్ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశాం

మిర్చియార్డులో సుమారు 50 టిక్కీలను జీరో బిజినెస్‌లో బయటకు తరలించాలని ఒక వ్యాపారి ప్రయత్నించగా అతనికి తొలి హెచ్చరిక జారీ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశామని సెక్రెటరీ తెలిపారు. మరోసారి జీరో బిజినెస్‌కు పాల్పడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఇతర అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమర్థుడైన మన్నవకు.. సరైన పదవి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- అట్టహాసంగా ఏపీటీఎస్ చైర్మన్‌గా మోహనకృష్ణ పదవీ బాధ్యతల స్వీకరణ



సభలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(తూర్పు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మన్నవ మోహనకృష్ణ సమర్థతను చంద్రబాబు నాయుడు, లోకేశ్ గుర్తించి సరైన కీలక పదవిని అప్పగించారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రింగురోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) చైర్మన్‌గా మన్నవ మోహనకృష్ణ బాధ్యతల స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం నుంచి అమెరికా ప్రయాణం వరకు మన్నవ మోహనకృష్ణ జీవితం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందన్నారు. గత పదేళ్లగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి మన్నవ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆలోచనలతో సాంకేతికతలో రాష్ట్రం పురోగమిస్తుందని అన్నారు. ఏపీటీ ఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ కీలకమైన పదవి అప్పజెప్పిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు నాయుడు తొలి జాబితాలో ఉంటారని, ఆయన అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. వచ్చే ఐదేళ్లలో టెక్నాలజీ రంగంలో 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పిన నారా లోకేశ్ ఆలోచనలను ముందుకు తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అభిమానులు, కూటమి కార్యకర్తలు సందడి చేశారు.

భారీగా హాజరైన ప్రజా ప్రతినిధులు

కార్యక్రమానికి భారీగా ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, వేగ్నశ నరేంద్ర వర్మ, జూలకంటి బ్రహ్మారెడ్డి, నక్కా ఆనందబాబు, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, యార్లగడ్డ వెంకటరావు, ఏపీఐడీసీ, మాదిగ, విభిన్న ప్రతిభావంతుల, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు డేగల ప్రభాకర్, ఉండవల్లి శ్రీదేవి, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పట్టాభిరామ్, కూటమి నాయకులు నిమ్మల శేషయ్య, కనపర్తి శ్రీనివాసరావు, బోనబోయిన శ్రీనివాస్, వేముల కొండ శ్రీనివాస్, అబ్బూరి మల్లి, మన్నవకు అభినందనలు తెలిపారు.

సహకార సంఘాల్లో.. బ్యాంకు సేవలు

200 రోజుల కార్యాచరణపై 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ నాగలక్ష్మి

(5 పేజీ తరువాయి)

ఉన్నది. రెడ్డిపాలెంలో ఏడు ఎకరాల భూమి ఉన్నది. అలానే ప్రత్తిపాడులోని కొత్త మల్లాయపాలెంలో 226.18 ఎకరాల భూమి ఉన్నది. ఈ ఆస్తుల పరిరక్షణ కోసం వక్ఫ్‌బోర్డు సీఈవోకు నివేదించాం. అక్కడి నుంచి అనుమతి రాగానే అవసరమైన పరిరక్షణ చర్యలు చేపడతాం.

గోల్డ్, చేనేతల కోసం క్లస్టర్లు

జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. మంగళగిరిలో గోల్డ్, చేనేతల కోసం క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. గోరంట్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రూ.40 లక్షలు ఖర్చు పెట్టి రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. అలానే గుంటూరు ఆటోనగర్‌లో మరో రూ.30 లక్షలతో రోడ్ల ప్యాచ్‌వర్కులు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పురోగతిలోకి తెస్తాం

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలను పురోగతిలోకి తీసుకొచ్చేందుకు తరచుగా సమీక్షలు నిర్వహిస్తున్నాం. పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ కింద 200 రోజుల యాక్షన్ ప్లాన్‌లో 6,305 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. అలానే రూ.37.47 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించామని కలెక్టర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రూ.10 లక్షల విరాళం

చుండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదగాదెలవర్రుకు చెందిన కల్నల్ డాక్టర్ కేపీరావు, ఎన్నారై గుత్తికొండ సూర్యకుమారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళంగా చెక్కును అందించారు. దేశం గర్వించదగిన స్థాయికి చేరిన కల్నల్ డాక్టర్ కేపీరావుకు సీఎం అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో వాటర్ పైపులైను లీక్ ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని గుంటూరు టౌన్4 డిప్యూటీ ఈఈ పీ హుస్సేన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్థానిక బుచ్చయ్యతోట, నెహ్రూనగర్, వెంకటాద్రిపేట, మోతీలాల్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

1 నుంచి అయ్యప్పలకు సద్ది

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట 4/4 లైనులోని శివాలయంలో డిసెంబరు 1 నుంచి అయ్యప్ప దీక్షా స్వాములకు సద్ది కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు అయ్యప్ప సేవా సమాఖ్య నాయకుడు సిరిపురపు శ్రీధర్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు సద్ది, రాత్రి 8.30 గంటలకు అల్పాహారం(భిక్ష) ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపుగా 40 రోజులు జనవరి 10 వరకు సద్ది, భిక్ష కార్య క్రమాలు కొనసాగుతాయని, దీక్షా స్వాములు ఈ సదు పాయాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే దోపిడీ, హింస, వేధింపులకు కారణమయ్యే వివాహాలు, లైంగిక నేరాలు, అక్రమ రవాణా మొదలగు అంశాలను క్షేత్రస్థాయిలో అరికట్టి వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి ,జడ్పీ డెప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి కిశోరి వికాసం శిక్షకుల శిక్షణా కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాలలకు సమతుల ఆహారం, ఆరోగ్యం, స్వీయ రక్షణ విధానాలు, రుతుక్రమ పరిశుభ్రత మొదలగు అంశాలపై అవ గాహన కల్పించాలని అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి విజయ్ కుమార్, నోడల్ అధికారి శ్రీవాణి, ఎ.పి.ఎం. మురళి, డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి వైపీ రెడ్డి, బచ్ పన్ బచావో ఆందోలన్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ బీ తిరుపతి రావు,పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సందు రామాంజనేయ ప్రసాద స్వామి పాల్గొన్నారు.

ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల చొరవతో ఆక్రమణల తొలగింపు


గుంటూరు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాత గుంటూరులోని శ్మశానాల రోడులోని ఆక్రమణలను తొలగింపుపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు స్థానికుల ప్రశంసలందుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డులో ఆక్రమణలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ రోడ్డులో ముస్లింల ఖబరస్థాన్‌తో పాటు హిందువుల పితృవనం ఒకే చోట ఎదు రెదురుగా ఉన్నాయి. అయితే, ఈ రోడ్డును వ్యాపారులు ఆక్ర మించుకోవడంతో ఆ మార్గం ద్వారా వెళ్లే వారు తీవ్ర ఇబ్బం దులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్య ఎంతో కాలంగా ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. అయితే, ఈ విషయం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల దృష్టికి రావడంతో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ స్పందించారు. తమ సిబ్బందితో ఆ రోడ్డులోని ఆక్రమణలను తొలగించారు.



కొత్తపేట స్టేషన్ పరిధిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కొత్తపేట ఎస్సై తరంగిణి

'మహిళా -మీ కోసం'పై అవగాహన

గుంటూరు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట పోలీసులు 'మహిళా ... మీ కోసం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు శుక్రవారం కొత్తపేట స్టేషన్ పరిధిలో ఎస్పీ సతీష్ కుమార్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో కొత్తపేట సీఐ .వీరయ్య పర్యవేక్షణలో మహిళా ఎస్సై తరంగిణి తన సిబ్బందితో అన్ని విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు వివరించారు. ఏ సమయంలో అయినా ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే 9746414641 కు లేదా 112కు గాని కాల్ చేస్తే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రిషితేశ్వరి కుటుంబానికి దక్కని న్యాయం: ఎస్ఎఫ్ఐ

గుంటూరు(విద్య),నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం జరగలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా నడుస్తున్న ఈ కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పునివ్వడం బాధాకరమని అన్నారు. ర్యాగింగ్, వేధిం పులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థినికి న్యాయం చేయకుండా ఇటువంటి తీర్పులు న్యాయస్థానాలు ఇవ్వడం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. ఈ కేసులో నింది తులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడ తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేమ్కో సమీర్ నగర అధ్యక్షుడు యశ్వంత్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

- ● స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ మనోహర్ నాయుడు
- ● 230 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చ

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో సుమారు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం అధ్యక్షుడు, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. స్థాయీ సంఘం అధ్యక్షుల ఛాంబర్ (మేయర్ ఛాంబర్)లో శుక్రవారం జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన 230 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ వార్డుల వారీగా జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం అందించి వారిని ఆహ్వానించాలన్నారు. గుంటూరు నగరంలో కుల, మత పార్టీలకతీతంగా ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజులు పూర్తయిన షాప్‌లకు నిబంధనల మేరకు లీజు రెన్యువల్ చేసినట్లు చెప్పారు. నగరంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మా ణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని అన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులు సంకురి శ్రీనివాసరావు, షేక్ మహమూద్, కాండ్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్, శ్యామల వెంకటరమణా దేవి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ మనోహర్‌నాయుడు, పక్కన కమిషనర్ , హాజరైన సభ్యులు

ప్రభుత్వ అవసరాలకు అద్దె భవనాలు

నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ అవసరాలకు అద్దె భవనాలు అవసరమని, నగరంలో ఆసక్తి కల్గిన భవన యజమానులు ఖాళీగా ఉన్న తమ భవన వివరాలను శనివారం సాయంత్రానికి అందజేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతెలిపారు. కమిషనర్ చాంబర్‌లో క్రెడాయ్, నరేడ్కో ప్రతినిధులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పారిశ్రామికంగా, ఐటీ పరంగా పలు సంస్థలను ఆహ్వానిస్తోందని, అందులో భాగంగా వచ్చే సంస్థల కార్యాలయాల కోసం ప్రత్యేకంగా భవనాలు అవసరమన్నారు. అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, నగరపాలక సంస్థ పరిధిలో ఆసక్తి కల్గిన భవన యజమానులు తమ భవన సమగ్ర వివరాలను నిర్దేశిత ఫారంలో నింపి అందించాలని కోరారు. అందిన ఫారాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అద్దె, కాల పరిమితి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, క్రెడాయ్ నుండి శివారెడ్డి, రాము, సాంబశివారెడ్డి, నరేడ్కో నుంచి దుర్గా ప్రసాద్, శ్రీనివాసకుమార్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను బాధ్యతగా పరిష్కరించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులను స్థానిక సచివాలయ కార్యదర్శులు బాధ్యతతో పరిష్కారం చేయాలని, రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలి దశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులకు స్పష్టం చేశారు. స్థానిక నల్లచెరువు, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తదుపరే బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేస్తామని చెప్పారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్, ఏసీపీ మల్లికార్జున పాల్గొన్నారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న డేగల ప్రభాకర్

వైసీపీ బాధితులకు న్యాయం చేస్తాం: డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ దౌర్జన్యాలు, భూకబ్జాల బాధితులకు న్యాయం చేస్తామని ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ హామీ ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బారులో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. సమ స్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేలా సంబం ధిత అధికారులను ఆదేశించారు. అర్జీదారుల్లో మెజారిటీ వైసీపీ బాధితులు, రెవెన్యూ సమ స్యలు, ఉద్యోగం, ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ తది తర సమస్యలపై అర్జీలు అధికంగా వచ్చినట్లు డేగల తెలిపారు. వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించామని చెప్పారు.

ఘనంగా యర్రగోపు పుట్టినరోజు వేడుకలు

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి యర్రగోపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు టీడీపీ గుంటూరు నగర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ కేక్ కట్ చేసి యర్రగోపు నాగేశ్వరరావుకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేకల బాబురావు, రాగం సదా శివరావు, కొండెపు శేఖర్ యాదవ్, కొనకళ్ల సత్యం, మేళం సైదయ్య, ఎద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో గుంటూరు 'తూర్పు': ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక బాలాజీ నగర్‌లో రూ.70 లక్షల వ్యయంతో జీఎస్‌బీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ప్రగతి నగర్‌లో రూ. 20 లక్షల వ్యయంతో డస్ట్ రోడ్డు, రూ. 16.15 లక్షలతో పదో డివిజన్‌లో యూపీహెచ్‌సీ సెంటర్ ప్రహరీగోడ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరంలో కొత్త కాలనీలు, ప్రాంతాలు ఏర్పడినప్పటికీ గత ఐదేళ్లుగా రోడ్లు, డ్రెయిన్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలకు అయా కష్టాలను తీర్చేందుకు సుమారు రూ.90 లక్షలతో వాటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత పాలనలో బాలాజీనగర్, ప్రగతి నగర్ శివారు ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించలేదని, వారి లాభం తప్ప ప్రజాభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రగతినగర్‌లో ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, షాజీలా, పటాన్ సమీర్, గుప్తా, కందుకూరి వెంకట్, రియాజ్, రియాసాత్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

● మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎండీ షరీఫ్‌కు ఎమ్మెల్యే నసీర్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన షరీఫ్‌ను ఆయన శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



విజేతలతో కోచ్‌లు, నిర్వాహకులు

క్రీడలతో మానసిక వికాసం

గుంటూరు(తూర్పు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం కలుగు తాయని బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాలలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల విద్యార్థుల అండర్-14, 16 జిల్లా స్థాయి త్రో బాల్, కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. కబడ్డీలో ఆయా విభాగాల్లో పిడుగురాళ్ల ఆక్స్ఫర్డ్ స్కూల్, పిడుగురాళ్ల స్కాలర్స్ స్కూల్, త్రో బాల్‌లో ఆయా విభాగాల్లో తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూల్, సెయింట్ జోసెఫ్ పాఠశాల విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జీవీ శివప్రసాద్, పీఈటీ పవన్ చక్రి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



శారదానికేతన్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో సీవీ రేణుక

శారదానికేతన్, భవితా కేంద్రాల్లో డీఈవో తనిఖీ

గుంటూరు(విద్య),నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ ఉన్నత , ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భవితా కేంద్రాన్ని డీఈవో సీవీ రేణుక శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులతో సంస్కృతంలో శ్లోకములు చదివించారు, 10వ తరగతి విద్యార్థులకు క్లాస్ నిర్వహించి, సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అందరు తీసుకోవడం, పాఠశాల పరిసరాలు అంతా పరిశుభ్రంగా ఉండటంపై డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు నూతలపాటి వీరప్రకాశ్, ఎన్ఆర్ఐ కాండ్ర అప్పారావు, లక్ష్మారెడ్డిలు రూ.50 లక్షల వ్యయంతో తరగతి గదుల కోసం భవనాలు నిర్మించేందుకు ముందుకు రావడం హర్షణీమని అన్నారు. అనంతరం భవితా సెంటర్‌ను పరిశీలించి అంగవైకల్యం కల్గిన విద్యార్థులపై సహృదయం చూపాలని వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని డీఈవో సూచించారు. డిసెంబరు 7 న జరగనున్న తల్లి దండ్రులు ఉపాధ్యాయుల సమావేశాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహంచేలా చూడాలని సూచించారు.



ఫొటోగ్రాఫర్‌ను సత్కరిస్తున్న విశ్రాంత ఎస్పీ డీ కోటేశ్వరరావు, టీవీ నాగరాజు

ఆధునిక సమాజంలో 'ఫొటోగ్రఫీ'కి ప్రత్యేక ప్రాధాన్యం

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో లలిత కళల్లో చిత్రలేఖనం తర్వాత ఫొటో గ్రఫీ అత్యున్నత స్థానంలో విరాజిల్లుతోందని, ఇది లేని వ్యవస్థను ఊహించ లేకున్నామని విశ్రాంత ఎస్పీ డీ కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంక టేశ్వర స్వామి వారి దేవ స్థానం పద్మావతి కళ్యాణ వేది కపై ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు నిష్ణాతులైన ఫొటోగ్రాఫర్లకు అవార్డులు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ పోలీస్ వ్యవస్థలో నేర స్తులను కోర్టుకు అప్పగించే విషయంలో సాక్ష్యాధారాల లో ఫొటోగ్రఫీ అవసరం ఎంతైనా ఉందన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఫొటోగ్రఫీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం తోపాటు రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీ కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వి ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నైపుణ్యాలను ప్రదర్శించే ఫొటోగ్రాఫర్లకు విస్తృతమైన ఉపాధి అవకాశాలతో పాటు సంఘంలో ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన అకాడమీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యుల సహకారంతో విస్తృత మైన కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఏరియల్ ఫొటోగ్రాఫర్ రవికాంత్ కుర్మాల తో పాటు 20 మందికి పైగా వివిధ రంగాలలో నిష్ణాతులైన ఫొటోగ్రాఫర్లను శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ టీవీ నాగరాజు, ఏపీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, మాలతి పాల్గొన్నారు.

జడ్పీలో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని సెల క్షన్ కమిటీ వికలాంగుల కోటాలో ఎంపిక చేసి జడ్పీకి కేటాయించిన అభ్యర్థులకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ విధానంలో ఎంపికైన కుందేటి పూర్ణచంద్ర రావును శంకర భారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్‌గా నియమించినట్లు ఆమె తెలిపారు.



ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న హెనీ క్రిస్టినా

వీధికుక్కల స్వైర విహారం.. వృద్ధురాలికి గాయాలు

గుంటూరు(కార్పొరేషన్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దారినపోయే వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరు స్తున్నాయి. వీధికుక్కల దాడిలో స్థానిక శ్రీనివాసరావుపేట 5వ లైన్‌కు చెందిన వృద్ధురాలు శుక్రవారం తీవ్రంగా గాయపడింది. కాగా, స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీ సాక్షిగా ఈ అంశంపై ఇటీవల మాట్లాడారు. ఇప్పటివరకు మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో, మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం

● డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సింగల్ విండో ద్వారా అందించిన దరఖాస్తులను పరిశీలించి నిర్దేశిత గడువులోగా అనుమతులు మంజూరు చేసేలా పరిశ్రమల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం, జిల్లా క్రైసిస్ గ్రూప్(డీసీజీ) సమావేశం సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం నిర్వ హించారు. డీఐఈపీసీ సమావేశం అజెండా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ లకు అవసరమైన వివిధ శాఖల అనుమతులు మంజూరుకు సమన్వయంతో చర్యలు తీసుకుని నివేదిక అందించాలన్నారు. ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రాం 2024-25 కింద రుణాలు మంజూరు చేసిన ఎంఎస్ఎంఇలు గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 16 క్లెయిమ్స్‌కు రూ.1,11,62,027 మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. పియం విశ్వకర్మ ట్రైనింగ్‌కు 2740 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంకు అవసరమైన అన్ని చర్యలు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఇ సర్వే నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికా ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ బి హిజ్రా మనోరమ, ఏపీఎస్ఎఫ్‌సి మేనేజర్ అజిత, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (ఎఫ్‌పిసి) టీ రాజు, ఏపీపీబీఈఈ ఎండీ నజీన బేగం, జే హరిబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'సలాం సమస్తే గుంటూరు' టాలెంట్ షో

విజయవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను వెలికితీసేందుకు డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు-పొన్నూరు రోడ్డులోని ఎం.కన్వెన్షన్ హాలులో 'సలాం నమస్తే గుంటూరు' టాలెంట్ షోను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఐఎంఏ హాలులో శుక్ర టవారం నిర్వహించిన మీడియా సమావేశంలో షమ సుల్తానా మాట్లాడుతూ నృత్యం, ధ్వని, హాస్యం, సంగీతం, ఫ్యాషన్ షో, మెహందీ, ఫన్నీ మెసేజ్ ఓరియంటెడ్ స్కిల్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 88864 66233, 77807 47626 నంబర్లలో సంప్రదించాలన్నారు.



తనిఖీల్లో పాల్గొన్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్‌బాబు, లక్ష్మీపురం రోడ్డులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఎట్టకేలకు రేసర్లపై పోలీసుల దృష్టి

● లక్ష్మీపురం రోడ్డులో ఆకస్మిక తనిఖీలు ● 20 ద్విచక్ర వాహనాలు సీజ్

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తోటి ప్రయా ణికుల గుండెల్లో రైళ్లు పరుగెత్తి స్తున్న రేసర్లపై ఎట్టకేలకు పోలీ సులు దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారం లక్ష్మీపురం యూనియన్ బ్యాంక్ సెంటర్ లో ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్ ఆధ్వర్యంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, సిబ్బంది ఈ ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా స్పీడ్ బైక్‌లతోపాటు విద్యార్థులు, రేసర్లకు సంబంధించిన ద్విచక్ర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పీడ్ బైక్‌లతో రోడ్లపై స్నేక్ డ్రైవింగ్ పేరిట విన్యాసాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్ బాబు తెలిపారు. ఇక నుంచి నిత్యం రింగ్ రోడ్డులో ఏదో ఒక ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సీజ్ చేసిన ఆయా వాహ నాలకు సంబంధించిన యువకులకు, వారి తల్లిదండ్రులకు శనివారం కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు.

సోషల్ మీడియా కేసులో సుధారాణి దంపతుల అరెస్టు


● పీటీ వారంట్ పై కోర్టులో హాజరు పరిచిన నగరంపాలెం పోలీసులు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ లపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కేసులో నిందితులు పెద్దిరెడ్డి సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డిలను నగరం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సుధారాణి దంపతులు ఇప్పటికే నరసరావుపేట జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుధారాణి దంపతులను నగరంపాలెం పోలీసులు పీటీ వారంట్‌పై గుంటూరు తీసుకువచ్చి ఆరవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ స్పందన ఎదుట హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ వారిద్దరికి 14 రోజులు రిమాండ్ విధించడంతో తిరిగి వారిని నరసరావుపేట సబ్ జైలుకు తరలించారు. టీడీపీ కార్యకర్త కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఈ నెల 3న నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్నాడులో జైనం ఉనికి

పల్నాటి గడ్డ.. పగ, ప్రతీకారాలకు, పల్నాటి వీరుల పౌరుష పరాక్రమాలకే కాదు.. ఒకప్పుడు శాంతి, అహింసను బోధించి అనుసరించిన గొప్ప జ్ఞానభూమి కూడా. ఎందుకంటే, పల్నాడులో జైన మతం భాసిల్లిందని చెప్పడానికిఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మాచర్ల పట్టణంలో జైనమతం ఉనికిని తెలిపే విగ్రహాలు గుర్తింపులోకి వచ్చాయి.

- తీర్థంకరుల విగ్రహాలు
- పాతమాచర్లలో పార్శ్వనాథుడు విగ్రహం
- నాగబుద్ధుని శివాలయంలో సుపార్శ్వనాథుడు



మాచర్లటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాత మాచర్లలోని వీరశైవ మతానికి చెందిన కంభాలమఠం వారి సమాధుల దొడ్డిలో సమాధుల మధ్యలో ఉన్న జైన తీర్థంకరులలో ఒకరైన 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు విగ్రహం ఉంది. నాలుగు అడుగుల ఎత్తులో ఉన్న ఈ నల్లరాతి విగ్రహంపై అద్భుతమైన శిల్పకళ ఉంది. ఏడు పడగల నాగుపాము పడగ నీడలో దిగంబరుడిగా, కాయత్సర్గ భంగిమ (నిలబడి)లో ఉన్న పార్శ్వనాథుడు ధ్యానము ద్రలో ఉన్నారు. ఆపైన మూడు పొరల (త్రిస్తర) ఛత్రాలు ఉన్నాయి. పాదాల వద్ద యక్ష, యక్షిణీయులు ఉన్నారు. ఈ తీరు శిల్పాన్ని చౌనీసి విగ్రహం అంటారు. ఈ చిత్రాలన్నీ అందంగా చెక్కబడి ఉన్నాయి.




కంభాలమఠం సమాధుల దొడ్డిలో పార్శ్వనాథుని విగ్రహం

పోతురాజుగా పూజలందుకుంటున్న తీర్థంకరుడు

పాత మాచర్ల నాగిరెడ్డి బజారులోని పోలేరమ్మ దేవాలయం చాలా పురాతనమైంది. ఈ ఆలయంలో క్రీస్తు శకం 1313 నాటి కాకతీయ దాన శాసనం ఉంది. ఈ దేవాలయం గర్భగుడి ఎదురు ఒక రాతిపై నాలుగు వైపులా కాయత్సర్గ భంగిమలో దిగంబరంగా ఉన్న తీర్థంకరుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. ఈ తీర్థంకరుడి విగ్రహాన్ని స్థానికులు పోతురాజుగా బావించి పూజలు చేస్తున్నారు. అయితే, ఈ విగ్రహం పోతురాజుది కాదు. జైన తీర్థంకరులలో ఒకరిది. అక్కడ జైన పాదాల ముద్రలు కూడా ఉన్నాయి.

జైనం.. ప్రస్థానం

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో జైనమతం పుట్టింది. జీనడు అంటే అన్నింటిని జయించిన వాడు అని అర్థం. మతాన్ని ప్రచారం చేసే వారిని తీర్థంకరులు (మార్గదర్శకులు, శాస్త్రము నిర్మించిన వాడు) అని అంటారు. కళింగ రాజు అయిన ఖరవేలుడి ఆదరణ వలన కృష్ణా నదికి ఉత్తర తీర ప్రాంతాల్లో ముందంజ వేసింది. అశోకుడి పుత్రుడు సంప్రతి ఆంధ్ర, ద్రవిడ దేశాల్లో జైనం వ్యాప్తికి కృషి చేశారు. అమరావతి సమీపంలోని వడ్డమాను కొండపై సంప్రతి విహారం ఏర్పడింది. అక్కడ ఖరవేలుడు మహా మేఘ వాహన విహారం నిర్మించాడని తెలుస్తోంది. చంద్రగుప్తులు, శాతవాహన కాలంలో ఈ ప్రాంతంలో జైన మత ప్రచారం జరిగినట్లు పరిశోధకుల అభిప్రాయం. ఆ తరువాత రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయ గణపతి దేవుని వరకు జైనమతం ఉందని తెలుస్తోంది. అనంతరం వీరశైవం, వీర వైష్ణవం కారణంగా కొన్ని జైనాలయాలు ధ్వంసం చేయబడి వాటిని శివాలయాలుగా, వైష్ణవాలయాలుగా మార్చి వేయడం జరిగింది. అలాగే, పల్నాడు ప్రాంతంలో మాచర్లలోని క్రీస్తుశకం 641వ సంవత్సరం శాసనం ప్రకారం, మరికొన్ని శాసనాల్లో 'పల్లినాటి', 'పల్లినాంటి వీరుడు' అని ఉందని, 'పల్లి' అంటే జైన బసదులని, ఆ కాలంలో జైన, బౌద్ధ ఆరామాలు ఎక్కువగా ఉండడం వలన పల్లినాడు అన్నారని చరిత్ర కారుల భావన.



నాగమయ్య కాదు సుపార్శ్వనాథుడు

మాచర్ల రింగు రోడ్డు నుంచి సాగర్ రహదారిలో ప్రభుత్వ కళాశాలకు వెళ్లే రహదారికి ఎదురుగా ఉన్న నాగబుద్ధుని శివాలయంలో పూజలందుకుంటున్న నాగమయ్య (నాగబుద్ధుడు) జైన తీర్థంకరులలో ఏడో తీర్థంకరులైన సుపార్శ్వనాథుడు. దేవాలయంలో మూడు రాతి స్తంభాలు ఉన్నాయి. వాటిలో ఐదు పడగల నాగుపాము నీడలో కాయత్సర్గ భంగిమలో ఉన్న సుపార్శ్వనాథుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. రెండు రాతి స్తంభాలపై ముందుభాగంలో, మధ్య స్తంభం ముందు, వెనుక భాగాల్లో ఈ చిత్రాలు ఉన్నాయి.

జైన బసది..

మాచర్ల మున్సిపల్ రిజర్వాయర్ పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్ ఆవరణలో శిథిల కట్టడం జైన బసది. అయితే, ప్రస్తుతం దానిని బాగు చేయించి శివాలయంగా మార్చారు. పన్నెండేళ్ల క్రితం శిథిలావస్థలో ఈ జైన బసది ఉండేది. దీనిలో కొందరు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి ధ్వంసం చేశారు. 2015లో దీన్ని బాగు చేయించి శివాలయంగా మార్చారు. జైనులు ధ్యానం చేసుకోవడానికి జైన బసదులు ఉపయోగించే వారు.



చెన్నకేశవ ఆలయం జైనాలయమా?

ప్రసిద్ధ మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం పూర్వం జైనుల లయం కావొచ్చని పలువురు పరిశోధకుల అభిప్రాయం. 12వ శతాబ్దంలో శివాలయం చెన్నకేశవ ఆలయంగా మార్చబడిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ దేవాలయం ముందు పెట్టిన బోర్డులో ఉంది. అయితే, జైనాలయం శివాలయంగా మారి ఆ తర్వాత చెన్నకేశవ ఆలయంగా మార్పు చెంది ఉండవచ్చని పలువురు చరిత్రకారుల అభిప్రాయం. అయితే, దీనిని నిరూపించే ఆధారాలు మాత్రం లేవు.



పోలేరమ్మ దేవాలయంలో తీర్థంకరుడి విగ్రహం

పార్శ్వనాథుని విగ్రహాన్ని పరిరక్షించాలి

మాచర్ల పట్టణంలో బయటపడిన ఈ జైన విగ్రహాలు శాసనాలు లేనందున ఏ కాలం నాటివో చెప్పడం కష్టం. వీటిని పురావస్తు శిలాతత్వ శాఖ వారు పరీక్షించి కాలం నిర్ణయించాల్సిందే. పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రభుత్వం పరిరక్షించాలి. జైన మతానికి సంబంధించిన ఇక్కడి అపురూప విగ్రహాలను పరిరక్షించడానికి పురావస్తు శాఖ దృష్టి సారించాలి.

ఎస్సీ మహిళల పరిశ్రమలకు
రూ.50 వేలు రాయితీ

- రూ. 1.64 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- డిసెంబరు 2 వరకు దరఖాస్తుకు అవకాశం
- డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ



గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ మహిళలకు ఉన్నతి పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిస్తున్నట్లు డీ డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ వెల్లడించారు. ఎస్సీ మహిళలు ఏర్పాటు చేసుకునే సూక్ష్మ, మధ్యతరహా యూనిట్లకు ప్రభుత్వం రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు పొందిన మహిళలకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 20868 డ్వాక్రా సంఘాలు ఉండగా, వారిలో ఎస్సీ సంఘాలు 6,556 ఉన్నాయని తెలిపారు. జిల్లాకు మొదటి విడతగా 82 యూనిట్లకు గాను రూ.1.64 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, డ్వాక్రా సంఘాల్లో ని 18- 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న ఎస్సీ మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. రాయితీ కోసం డిసెంబరు 2న ఐదు గంటల లోపు స్థానిక వెలుగు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పీడీ విజయలక్ష్మీ సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర సదస్సు

- హాజరుకానున్న 600 మంది చర్మవ్యాధుల వైద్య నిపుణులు
- ఐఏ డీవీఎల్ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, సీతారామ్, కవిత, సౌజన్య

గుంటూరు మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ 43వ వార్షిక వైద్య సదస్సు 'ఏపీ క్యుటికాన్ 2024' ఈ నెల30, డిసెంబర్ 1 తేదీల్లో గుంటూరులో జరుగుతున్నట్లు ఏపీ చర్మ వ్యాధుల వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల శ్రీ కన్వెన్షన్‌లో శని, ఆదివా రాల్లో జరిగే ఈ వైద్య సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 600 మంది వైద్యులు, పీజీ మెడికల్ విద్యార్థులు హాజరవుతున్నట్లు డాక్టర్ కవిత వివరించారు. ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్ సదస్సును ప్రారంభిస్తారన్నారు. సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేపీ సీతారామ్ మాట్లాడుతూ సదస్సులో చర్మ వ్యాధులతో పాటు కుష్ఠు, లైంగిక వ్యాధులు, జుత్తు సమస్యలు, లేజర్ చికిత్సలు, సౌందర్య చర్మచికిత్సలు, బొల్లి మచ్చలు, ఇతర పిగ్మెంటేషన్ వ్యాధులకు సంబంధించిన ఆధునిక చికిత్సలపై పలువురు వైద్యనిపుణులు ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో 12 మంది జాతీయ ఫ్యాకల్టీ, 40 మంది ఫ్యాకల్టీ ఆయా అంశాలపై ప్రసంగిస్తారన్నారు. 30 పోస్టర్ ప్రజెంటేషన్ పేపర్లు సదస్సులో ప్రదర్శిస్తామన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జే సౌజన్య మాట్లాడుతూ డిసెంబరు 1న వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ భూమేష్ కుమార్ కటకం పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో కే డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ టీ మోహన్‌రావు పాల్గొన్నారు.



కలక్టరేట్ లోని ఈవీఎంల గోడౌన్ పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాసవారి తనిఖీలలో భాగంగా శుక్రవారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పరిశీలించారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై గడువు తేదీని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీ పాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను గుంటూరు ఆర్డీవో కే. శ్రీనివాసరావు తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేటట్లు పర్యవేక్షిస్తుండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్. ఖజావలి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం తహసీల్దార్ జె. ప్రసాదరావు, గుంటూరు ఆర్‌అండ్‌బీ ఈ.ఈ విశ్వనాధ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా
ఆంధ్రా - ఉత్తరాఖండ్ మ్యాచ్



హనీష్ (106 పరుగులు)



మన్విత్ (55 పరుగులు)

మంగళగిరి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహార్ అండర్-19 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 76 పరుగులతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 80 ఓవర్లలో 337 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా జట్టులో కే.హనీష్ వీరారెడ్డి 6 సిక్సర్లు, 11 ఫోర్లతో 106 పరుగులు, మన్విత్‌కుమార్ రెడ్డి 55 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ బౌలర్లు రితిక్ దూహాన్, జతిన్‌లు చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 33ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసింది. ఉత్తరాఖండ్ బ్యాటర్ అరవ్ మహాజన్ 61 పరుగులు చేయగా, ఆంధ్రా బౌలర్లు ఎన్.రాజేష్, ఏఎస్‌వీ లోహిత్‌లు చెరో వికెట్ సాధిం చారు. ఉత్తరాఖండ్ విజయం సాధించా లంటే మరో 256 పరుగులు చేయాల్సివుంది.



అరవ్ (61 పరుగులు)

నేటి నుంచి
వీరారాధనోత్సవాలు



మండల కేంద్రమైన కారంపూడిలో శనివారం నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 జిల్లాల వీరాచారవంతులు తమ ఆయుధాలతో యుద్ధభూమికి రానున్నారు. మొదటి రోజైన ఈనెల 30వ తేదీన రాచగావు, డిసెంబరు 1న రాయభారం, 2న మందపోరు, 3న కోడిపోరు (ప్రధానమైనరోజు), 4న కల్లిపాడు జరపనున్నారు.



ముస్తాబైన ఆలయం



కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారు ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయాలు బ్రహ్మనాయుడు మేడ, కన్నమదాసు మేడలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

నేడు ఎడ్ల పోటీలు ..

వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్వయంగా ప్రారంభించనున్నారు.

అంకాళమ్మ దేవాలయం

పల్నాటి యుద్ధానికి పూర్వం కార్యమపూడి అని పిలువబడే నేటి కారంపూడిలో అంకాళమ్మ, సూరేశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు నేటికీ వీరాచారవంతులు వచ్చి కొలుపులు జరుపుతుంటారు. 12వ శతాబ్దానికి ముందు నిర్మించిన అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో ఎదురుగా ఉన్న నాగులేటి ఒడ్డున పల్నాటి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో వీరు ఒక్కొక్కరుగా నేలకొరుగుతుంటే అమ్మవారి విగ్రహం నుంచి కన్నీరు కారుతుండేదట. ఆ నీరు నేలమీద పడితే అరిష్టమని అప్పటి పూజారులు కంటి కింద ఓ గిన్నెను అమర్చారు. వీరులు మరణిస్తుంటే అమ్మవారి తల వరిగిందంట. అప్పటికీ అమ్మవారి తల ఒరిగినట్లు విగ్రహం దర్శనమిస్తోంది. అంతటి మహిమాన్విత శక్తి గల అంకాళమ్మ అమ్మవారిని భక్తులు వేలాధిగా కొలుస్తుంటారు. మాలదారణ స్వీకరించి దీక్ష చేపట్టి వీరారాధన ఉత్సవాల్లో కోడి పోరు రోజున ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తారు. వీరాచారవంతు కత్తి సేవ చేసి అమ్మవారికి కొలుపులు జరుపుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో అంకమ్మ, అంకాళమ్మ, అంకారావు అనే పేర్లు అనేక మందికి ఉంటాయి. సంతానం లేని వారు అమ్మవారిని కొలిచి ఆమె పేరు పెట్టుకుంటామని మొక్కుకుంటే సంతానం కలుగుతుందని ప్రసిద్ధి. శ్రావణమాసం రెండో శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం జరపడం అనాధిగా వస్తోంది.

చెన్నకేశవస్వామి దేవాలయం


మాచర్ల రాజ్యానికి మంత్రిగా ఉన్న బ్రహ్మనాయుడు కారంపూడిలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆయన కారంపూడి వచ్చినప్పుడు ఆయన మేడలో నివసిస్తూ గంగధార మడుగులో స్నానమాచరించి చెన్నకేశవస్వామిని దర్శించుకొని వెళ్లేవారట. చెన్నకేశస్వామి ఆలయంలో ముఖ మండపం ముందు ఓ బావి ఉండేది. ఆ బావిలో నీరు తాగితే ఎక్కడలేని వీరావేశం వచ్చేది. దీంతో ఆ బావిని మూసివేశారని చరిత్రకారులు తెలుపుతున్నారు. నేటికీ చెన్నకేశవుని వీరారాధన ఉత్సవాల్లో వీరాచారవంతులు పూర్వీకుల ఆయుధాలతో వచ్చి కత్తి సేవ చేసి తీర్థం పుచ్చుకుంటారు. ఆనాటి ఆలయాన్ని 2004లో దేవాదాయ శాఖ జీర్ణోద్ధరణ గావించింది.



నాగులేరు..

నాగులేరు ...

వీరుల దేవాలయ సరిహద్దుల్లో నాగులేరు ఉంది. ఈ ప్రాంతంలోనే గంగధార మడుగు ఉంది. గంగధార మడుగును శ్రీనాథ మహాకవి కాశీలోని మణికర్ణికఘాట్‌తో పోల్చారు. అందుకే వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు వచ్చేటప్పుడు గంగధార మడుగులో స్నానమాచరించి పూజలు నిర్వహిస్తారు.



అయ్యప్ప భక్తులకు
తెలుగు వైద్యుల స్వచ్ఛంద సేవలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

- శబరిమల, పంబలో ఓపీ వైద్యసేవలు
- 12 వైద్య బృందాలు..60 రోజులు సేవలు
- డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కేరళలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో అయ్యప్ప భక్తులకు ఉచితంగా, స్వచ్ఛందంగా వైద్యసేవలు అందించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐఎంఏ వైద్యులు ముందుకొచ్చారు. శబరిమల, పంబలో 68 రోజుల పాటు 12 బృందాలు (ఒక్కొక్క బృందంలో ఆరుగురు వైద్యులు) స్వచ్ఛంధ వైద్యసేవలు అందించేందుకు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. డిసెంబరు, జనవరి మాసాల్లో వణికించే చలిలో అయ్యప్ప భక్తులు కొండపై ప్రయాణం చేయడం చేస్తుంటారు. దీంతో వేలాది మంది భక్తులు జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు, కాళ్ళ నొప్పులకు గురౌతున్నారు. గతేడాది 45 లక్షల మంది అయ్యప్ప భక్తులు శబరిమలను సందర్శించగా, వీరిలో 32 మంది భక్తులు మృతి చెందారు. వీటిని గమనించిన అయ్యప్ప భక్తులైన వైద్యులు 'డివోటీ డాక్టర్స్ ఆఫ్ శబరిమల' పేరిట సంఘంగా ఏర్పడి డిసెంబరు, జనవరిలో శబరిమల, పంబలో భక్తులకు స్వచ్ఛంధ వైద్య సేవలు అందిస్తామని కోరగా, కేరళ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 118 మంది ఐఎంఏ వైద్యులు, వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి 25 మంది ఈ స్వచ్ఛంధ వైద్యసేవలో పాల్గొంటున్నారు. జనవరి 17వరకు ఈసేవలు కొనసాగుతాయి. ఈ విధుల్లో ఉండేవారిని 'కేరళ ప్రభుత్వ వైద్యులు'గా గుర్తింపునిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల సేవలకు అరుదైన గౌరవం కల్పిస్తోంది.

అయ్యప్ప సేవలో తరించడం గొప్ప అదృష్టం..

పవిత్ర పుణ్యక్షేత్రమైన శబరిమలలో అయ్యప్ప భక్తులకు వైద్యసేవలు అందించే అవకాశం కలగడం తమ అదృష్టంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. డిసెంబరు 1 నుంచి 5 రోజుల పాటు శబరిమల, పంబలో వైద్యసేవలు అందించేందుకు వెడుతున్న సందర్భంగా ఆయన శుక్రవారం గుంటూరులో విలేకరులతో మాట్లాడారు. తనతో ఆరుగురు వైద్య బృందం శబరిమల, పంబల్లో సేవలు అందించేందుకు వెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో శబరిమలవెళ్లే వైద్య బృందంలో సభ్యులైన డాక్టర్ మోపర్తి శ్రీనివాస్ (విజయవాడ), లావు సతీష్ (చిలకలూరి పేట), డాక్టర్ శ్రీనివాసరెడ్డి (గుంటూరు) పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

461 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల , నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 461 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,150, గరిష్ఠ ధర రూ. 11,275, మోడల్‌ధర రూ. 11,275 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,150, గరిష్ఠ ధర రూ. 11,275 మోడల్ ధర రూ. 11,275 పలికాయి.

పశ్చిమ డెల్టాకాల్వకు

2435 క్యూసెక్కులు

దుగ్గిరాల , నవంబరు (ఆంధ్రజ్యోతి)29: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 2435 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 426 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 44, పశ్చిమకాల్వకు 58 , నిజాంపట్నంకాల్వకు 190, కొమ్మమూరు కాల్వకు 1198 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నేడు జాబ్‌మేళా

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన మంగళగిరి గణపతి నగర్‌లోని వీజే డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా జరుగనుంది. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాలలో 9 కంపెనీలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. 19 నుంచి 35 సంవత్సరాల మధ్య గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు పీ.శ్రావణి, సెల్: 9347372996 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఐవీ నివారణపై

అవగాహనా ర్యాలీ

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఐవీ నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ హరిత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.అనూష, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరీ, డాక్టర్ శుభమ్, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు

ఏపీ సైక్లింగ్ టీమ్‌ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మందడం గ్రామంలో సీడ్ యాక్సెస్‌రోడ్ వద్ద ఈనెల 30, డిసెంబరు 1వ తేదీల్లో ఏపీ సైక్లింగ్ అండర్-14, 16, 18 బాల,బాలికలు 20 ప్లస్ మహిళలు, పురుషుల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 8 గంటలకు గుడ్‌రోడ్ స్కూల్లో రిపోర్టు చేయాలన్నారు. ఇక్కడ సత్తా చాటిన వారిని డిసెంబరు 7 నుంచి 10 వరకు ఒడిసాలోని పూరిలో నిర్వహించే జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు 98493 79932 సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ

మృత దేహం లభ్యం

ఫిరంగిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఈనెల 27వ తేదీన రాత్రి 8:30 గంటల సమయంలో గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని కనుగొన్నట్టు శుక్రవారం ఫిరంగిపురం పోలీసులు తెలిపారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, అనారోగ్యంతో చని పోయి ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు ఫిరంగిపురం పోలీసులకు సెల్ : 9440900876కు ఫోన్ చేసి తెలియపరచాలని పోలీసులు కోరారు.

రిషితేశ్వరి కుటుంబానికి

దక్కని న్యాయం: ఎస్‌ఎఫ్‌ఐ

గుంటూరు(విద్య),నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం జరగలేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా నడుస్తున్న ఈ కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు నివ్వడం బాధాకరమని అన్నారు. ర్యాగింగ్, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థినికి న్యాయం చేయకుండా ఇటువంటి తీర్పులు న్యాయ స్థానాలు ఇవ్వడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈ కేసులో నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని లేని పక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో

చలపతి విద్యార్థుల ప్రతిభ

తాడికొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐఐటీ మద్రాస్ నిర్వహించే నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) పరీక్షా ఫలితాల్లో క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో టీ.శశిపవన్ మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు కళాశాల సెక్రటరి వై.సుజిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సుజిత్‌కుమార్ మాట్లా డుతూ జాతీయ స్థాయిలో చలపతి ఇంజనీరింగ్ కళాశాల మొదటి స్థానంలో ఉందన్నారు. పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో 12 మంది విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. మొదటి ర్యాంకు సాధించిన శశిపవన్‌ను నగదు, ప్రశాంసపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్ డీ.వినయ్‌కుమార్, ఎన్‌పీటీఈఎల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీ.వీ. నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

'పల్లెపండుగ'తో అభివృద్ధి పరుగులు



నాగులపాడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

పెనందిపాడు, నవంబరు, 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేసేందుకు పల్లెపండుగ ద్వారా నిధులు విడుదల చేసిన విషయం విదితమే. ఆ నిధులతో గ్రామాల్లో ముమ్మరంగా సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వపాలనలో ఏ ఒక్కరూ రహదారుల గురించి పట్టించుకున్నది లేదు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న మాటలను నిత్యం వల్లించే వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఆ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఎన్నికల ముందు హడావుడిగా కొన్ని పనులను ప్రారంభించినా, వాటిల్లో ఏ ఒక్కటినీ పూర్తిచేసింది లేదు. దీంతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జడ్పీ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల దుస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం పల్లెపండుగ ప్రత్యేక కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. తద్వారా గ్రామాల్లోని రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. మండలంలో తొలివిడతగా ఎనిమిది గ్రామాలకు రు.85 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు పూర్తయితే గ్రామాల రూపురేఖలు మారనున్నాయి.

- ముమ్మరంగా సాగుతోన్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులు
- గ్రామాలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- అభివృద్ధే లక్ష్యంగా కూటమి అడుగులు



కొప్పర్రులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన..

- నర్రా బాలకృష్ణ, మాజీ ఎంపీపీ పెదనందిపాడు.



కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు కొనియాడేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే గ్రామాల్లో మరుగున పడిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. పనుల నిర్వహణకు నిధులనూ మంజూరు చేయడంతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో గ్రామాలు నూతన రూపురేఖలను సంతరించుకుంటున్నాయి.

గ్రామాలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం



గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసింది. అభివృద్ధి పనులను పూర్తిగా విస్మరించారు. దీంతో పలు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉండేది. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రోడ్ల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ప్రాధాన్యత రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. **- మాదినేని శౌరిబాబు, సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు, కట్రపాడు**



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ సదాశివరావు

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

● నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివరావు

మంగళగిరి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే నాయిబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఏపీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివరావు అన్నారు.నాయిబ్రాహ్మణుల కార్తీక వనసమారాధన శుక్రవారం పెదవడ్లపూడి పరిధిలోని గోలి నాగశయనరావు తోటలో జరిగింది. ఈ సందర్భంగా మున్నంగి చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సదాశివరావు మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు సామాజిక ఐక్యతకు దోహదం చేస్తాయన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేస్తూ రూ.39 వేల కోట్లు కేటాయించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులను కేటాయించలేదని విమర్శించారు. బీసీల కోసం కేటాయించిన నిధులను దారిమళ్లించి నవరత్నాలకు ఖర్చు చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం దేవస్థానం పాలక మండళ్లలో నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించడంతోపాటు దేవాలయాల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణుల వేతనాన్ని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచిందని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో రాబోయే రోజుల్లో నాయిబ్రాహ్మణులకు మరింత మంచి జరుగనుందని తెలిపారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, నాయిబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు ఆకునూరు ఉమామహేశ్వరరావు, నేతలు తెంపల్లి దుర్గారావు, మద్దిరాల గంగాధర్‌రావు, తెంపల్లి అనిల్, అద్దెపల్లి వెంకటేశ్వరరావు, పరుచూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏసీసీ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్న కార్మికులు

34వ రోజుకు కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 34వ రోజుకు చేరుకున్నాయి. పక్కాగా కొత్త ఇళ్ల నిర్మాణానికి కార్మికులు అక్కడ శ్రీకారం చుట్టారు. షెడ్లు వేసుకుంటున్నారు. ఈ సందర్భంగా సీఐటియూ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ మరింత పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. మంత్రి నారాలోకేశ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, అంకయ్య, ఆశీర్వాదం, యెహోషువ, సాంబయ్య, శారద, రమాదేవి, దుర్గమ్మ, సారమ్మ, గురవయ్య, ఇమాంబి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దుగ్గిరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయాల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారిణి పీ.శిరీష అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో రైతుల ఆరబెట్టిన ధాన్యాన్ని ఏవో పరిశీలించారు. రైతులతో శిరీష మాట్లాడుతూ, ప్రభుత్వం క్వింటాల్ ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర రూ.2300 లకు కొనుగోలు చేస్తోందని, గోతాములు రైతుసేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. ముఠా కూలీ ఖర్చుల కోసం క్వింటాల్‌కు రూ.17.17పైసల చెల్లిస్తూ, రవాణా ఖర్చులను చెల్లిస్తోందన్నారు. తేమ శాతం 17 ఉంటే తరుగు లేకుండా 17 నుంచి 22 శాతం వరకూ ఒక్కోశాతానికి ఒకకిలో చొప్పున తరుగు తీసి పూర్తి ధరను చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులెవ్వరూ దళారులకు తక్కువధరకు ధాన్యం విక్రయించాల్సిన అవసరం లేదని, రైతుసేవాకేంద్రాలకు వెళ్లి వ్యవసాయసేవా సహాయకులను కలిసి పేర్లను నమోదు చేసుకోవచ్చునని రైతులకు వ్యవసాయాధికారి శిరీష సూచించారు.

డిసెంబరు 2 నుంచి

రామనామ సప్తాహ మహోత్సవాలు

వట్టిచెరుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంజనంపాడు గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయం 60వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు డిసెంబరు 2 సాయంత్రం గ్రామంలో స్వామి వారి ఊరేగింపుతో ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో కోదండ రామస్వామి వారి దేవస్థానం కమిటీ, దేవాలయ ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లతో పాటు ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రంగు రంగుల విద్యుత్‌దీపాలతో ఏర్పాటు పనులను ప్రారంభించారు. కోయశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కార్తీక మాస పూజలు

వట్టిచెరుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో మహిళలు దీపోత్సవాలు నిర్వహించి పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై

అవగాహన అవసరం

దుగ్గిరాల, నవంబరు 29: విద్యార్థి దశలో ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని దుగ్గిరాల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ సీ. ఇందిర అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తే జరిగే నష్టాలు, జీవితంలో ఎదురయ్యే సమస్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవరెడ్డి, వై.పూర్ణచంద్రరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బండ్లమూడి రాంబాబు, పీహెచ్‌సీ సిబ్బంది జానమ్మ, ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో ప్రయోజనం

● రైతులతో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వట్టిచెరుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ద్రవ రూప జీవన ఎరువుల వినియోగ పద్ధతిలో సాగు రైతులకు ఎంతగానో లాభసాటిగా ఉంటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోనే ఉంటూ ప్రతి రోజూ రైతులతో కలసి వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పలు పద్ధతులను రైతులకు వివరిస్తున్నారు. శుక్రవారం ద్రవ రూప జీవన ఎరువులతో విత్తన శుద్ధిని రైతుల సమక్షంలో చేశారు. రైజోబియా, ఇనామ్‌క్యూలేట్‌ను వాడి విత్తనశుద్ధి చేసే పద్ధతిని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి త్రో బాల్ పోటీల్లో

గుడ్‌న్యూస్ హైస్కూల్ ప్రతిభ

తాడేపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): త్రోబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఈ నెల 28న గుంటూరు లోటస్ ఆద్య పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తాడేపల్లిలోని గుడ్‌న్యూస్ హైస్కూల్ విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో జట్టు కెప్టెన్ సింధు, హర్షిత, లాస్య, సరి, లిఖిత, నందిని, మేఘన, అక్షయప్రియ సుజాతలను ప్రిన్సిపాల్ అరోకియా దాస్, పీడీ అజయ్ కుమార్, పీఈటీ యశస్విని అభినందించారు. ఈ సందర్భంగా ఫాదర్ అరోకియా దాస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారులను అభినందించారు.

ఆదర్శ ఉపాధ్యాయురాలు కొండమ్మ

ఫిరంగిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ ఉపాధ్యాయురాలిగా మాదాను కొండమ్మ(87) పని చేశారని బాల ఏసు కథెడ్రల్ చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి అన్నారు. కొండమ్మ టీచర్ గురువారం మృతి చెందగా శుక్రవారం ఫిరంగిపురం చర్చిలో అంతిమ యాత్ర దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయినిగా ఎంతో మంది విద్యార్థినిలను తీర్చిదిద్దారన్నారు. మరో వైపు ఆధ్యాత్మికంగా దేవుని సేవలోను తరించారన్నారు. పూజల్లో గురువులు, మృతురాలి బంధువులు, ఆత్మీయులు, పూర్వ విద్యార్థులు, సెయింట్ ఆన్స్ అర్‌సీఎం కన్యాస్త్రీలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, టీడీపీ పట్టణ అధ్యక్షులు కటికల అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు

ఆర్థికాభివృద్ధి సాధించాలి

తాడికొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించన ప్పుడు కుటుంబం, సమాజం అభివృద్ధి సాధిస్తాయని ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలోని ఉమెన్ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఉద్యమ శక్తి, నాయకత్వ లక్షణలు, పని-జీవిత సమతుల్యత, మార్గదర్శకత్వ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యమ శక్తి అంటే కొత్త ఆలోచనలు, వ్యాపార అవకాశాలు కల్పించి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దడం అన్నారు. సృజనాత్మకత, నైపుణ్యాలు, ఔత్సాహికత కలయిక, చిన్న వ్యాపారాలు మొదులుకొని పెద్ద సంస్థల వరకు వ్యవస్థలను అభివృద్ధి చెందెలా చూడలన్నారు. పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత సాధించటం అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి అవసరం అన్నారు. న్యాయకత్వం అంటే వ్యక్తులు, ఒక జట్టును నిర్ధిష్ట లక్ష్యానికి దారి చూపడం అని తెలిపారు. నాయకుడు జట్టు సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి ప్రేరణ కల్పించి, కొత్త మార్గాలు చూపి నిర్ణయాలను అమలు చేయాలన్నారు. మార్గదర్శకుడు అనుభవజ్ఞుడైన వ్యక్తి, సలహాలు, మార్గనిర్దేశం ద్వారా ఇతరులను అభివృద్ధి చేస్తాడన్నారు. విద్యార్థినులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చైతన్యతపోవన్‌లో

ఉచిత వైద్యపరీక్షలు

తాడేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ పటమట పీవీఆర్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని నులకపేట చైతన్య తపోవన్‌లో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని చైతన్య తపోవన్ వ్యవస్థాపకులు మాతా శివచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్యశిబిరంలో ఎకో ఇసిజి, వంటి కీలకపరీక్షలు, మెదడు, నరాలు, కంటి ఆర్థో పరీక్షలు గైనిక్ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ శ్రీను చౌదరి, కార్డియాలజిస్టు డాక్టర్ నాగకిరణ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శైలజ, గైనకాలజిస్టు సుభద్ర, లాబ్ టెక్నీషియన్ భవాని, సిబ్బంది, కావ్య, కీర్తన, భవాని, క్యాంపస్ సహాయకుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 190 మందికి వైద్యసేవలు అందించారు.



రైతులతో మాట్లాడుతున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ నవీన్

రాజధాని రైతుల సమస్యలను

తక్షణమే పరిష్కరించండి

● గ్రీవెన్స్‌లో అధికారులకు సీఆర్డీఏ అదనపు కమిషనర్ నవీన్ ఆదేశాలు

తుళ్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు గ్రీవెన్స్ డే ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకుంటున్నారని, గ్రీవెన్స్‌కొచ్చిన సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఏపీ సీఆర్డీఏ అదనపు కమీషనర్ మల్లారపు న వీన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఆయన రాజధాని రైతుల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు.సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అదనపు కమీషనర్‌కు వచ్చిన సమస్యలలో అధిక శాతం అక్కడకక్కడే పరిష్కార మార్గం చూపారు.తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమీషనర్ నవీన్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేకి అమరావతిలో భూమి వ్యవహారాలు-46, ప్రణాళికా విభాగం-2. డెలవప్‌మెంట్ ప్రమోషన్స్-2. భూమి సర్వే-1, డెలప్‌మెంట్ ప్రమోషన్స్-2 సంబంధించిన అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్‌నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ.రామకృష్ణన్, డీసీవో బొర్రా శ్రీనివారావు, తహసీల్దార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



షరీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు చెపుతున్న రాజధాని మహిళలు, రైతులు

మండలి మాజీ చైర్మన్ షరీఫ్‌కి

రాజధాని రైతుల అభినందనలు

తుళ్లూరు, నవంబరు 29:(ఆంధ్రజ్యోతి) శాసన మండలి చైర్మన్ హోదాలో ఉన్నప్పుడు ఎన్ని అండకులు వచ్చినా ఎదుర్కొని నిలబడి న్యాయం వైపు ఉండి, అమరావతి రైతులకు అండగా నిలబడిన షేక్ షరీఫ్ ముస్లిం మైనార్టీ స్టేట్ అడ్వైజర్ హోదాలో శుక్రవారం మొట్ట మొదటిసారిగా వెలగపూడి సచివాలయంలో తన ఛాంబర్‌కు వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి రైతులు, మహిళలు శుక్రవారం ఆయను కలసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆనాడు వైఎస్ జగన్‌రెడ్డి మూడు రాజధానుల బిల్లు శాసన మండలిలో ఆమోదించాలని ఎంత ఒత్తిడి తెచ్చినా షరీఫ్ తలొగ్గకుండా బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి అమరావతి రైతులకు అండగా నిలిచారని ఈ సందర్భంగా రైతులు గుర్తు చేశారు.

పాఠశాల ఆవరణలో

మందు బాబుల వీరంగం

● చీకటి పడితే చాలు బార్‌గా మార్చేస్తున్న వైనం

మేడికొండూరు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) మేడికొండూరు మండలం, సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం రాత్రి మందుబాబులు వీరంగం సృష్టించారు. చీకటి పడితే చాలు పాఠశాల ఆవరణను బారుగా మార్చేస్తున్నారు. రాత్రి వేళ జనసంచారం అంతగా లేకపోవడంతో మందుబాబులు పాఠశాల ఆవరణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం వంట సామగ్రిని చెల్లాచెదురుగా పడవేశారు. కోడిగుడ్లను ధ్వంసంచేశారు. కట్టెలను చెల్లాచెదురుగా పడవేశారు. ఈ విషయంపై శుక్రవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాఠశాలకు చేరుకున్న పోలీసులు ఆవరణలో చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రిని పరిశీలించారు. పోలీసులు పాఠశాలలో ఉన్నారని తెలుసుకున్న పలువురు గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాఠశాలకు వద్దకు వెళ్లి పోలీసులతో మాట్లాడారు. మందుబాబుల ఆగడాలు గ్రామంలో ఇటీవల ఎక్కువయ్యాయని, వారి చేష్టల కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. గ్రామంలో రెండు మద్యం దుకాణాలు రెండు ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా మందు బాబులు మద్యం తాగేందుకు అధిక సంఖ్యలో సిరిపురం గ్రామానికి వచ్చి వెళ్తూ ఉంటారని, ఇలా గుర్తుతెలియని వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పోలీసులు జోక్యం చేసుకొని పాఠశాల ఆవరణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



సామగ్రిని చెల్లాచెదురుగా పడవేసిన మందుబాబులు



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

బహిరంగ ప్రదేశాల్లో

మద్యం తాగితే కఠిన చర్యలు : సీఐ

గురువారం రాత్రి సిరిపురం పాఠశాల ఆవరణలో మందుబాబులు చేసిన వీరంగం గురించి విద్యార్థులు, ఉపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా పాఠశాల ఆవరణలో విధ్వంసం సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళల్లో నిఘా పెంచుతామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితూ కఠిన చర్యలు తప్పవని మందుబాబులను హెచ్చరించారు.

నేడు డయిల్ యువర్ డిపో మేనేజర్

పొన్నూరు టౌన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 30వ తేదీన డయిల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజిత కుమారి శుక్రవారం తెలిపారు. పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు తమ సమస్యలను, సలహాలను 9959225267 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

అభివృద్ధి ఊసేలేని విలీన పంచాయతీలు

● ప్రహసనంగా వార్డుల ఏర్పాటు
● కోర్టు తీర్పుతో వార్డుల పునర్విభజన నిలిపివేత
● నిలిచిన ఆర్థిక సంఘం నిధులు
● అభివృద్ధికి నోచుకోని గ్రామ పంచాయతీలు



సిమెంటు డ్రెయిన్లు లేని అలూరు



కట్టెంపూడిలో పగళ్లు ఇచ్చిన ప్రధాన రహదారి

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలో వైసీపీ పాలకుల నిర్వాకంతో విలీన ప్రతిపాదిత పంచాయతీలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయాయి. పొన్నూరు పురపాలక సంఘం విస్తరణ పేరుతో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పొన్నూరు సమీపంలోని చింతలపూడి, వడ్డిముక్కల, ఆలూరు, కట్టెంపూడి, పెద్ద ఇట్టికంపాడు, కసుక్రు పంచాయతీలను పురపాలక సంఘంలో విలీనం చేయాలని ప్రతిపాదనలు పంపారు, అయితే ఈ విలీన ప్రతిపాదన సక్రమంగా నిర్వహించకపోవటం, గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండా ప్రత్యేక అధికారుల ఆమోదంతో విలీన ప్రక్రియను ప్రారంభించారు. అంతేకాకుండా పురపాలక సంఘంలో 31 వార్డులు ఉండగా ఈ విలీన గ్రామాలను కలుపుకొని 36 వార్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రక్రియ అంతా తప్పుల తడకగా, ప్రహసనంగా మారటంతో గ్రామ పంచాయతీల ప్రజలు, పురపాలక సంఘ వాసులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. భౌగోళికంగా పొన్నూరు పురపాలక సంఘానికి దూరంగా ఉన్న వడ్డిముక్కల, ఆలూరు, ఇట్టికంపాడు పంచాయతీలు విలీనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వార్డుల పునర్విభజన ప్రక్రియ పేరుతో అడ్డగోలుగా వార్డులను విభజించారని రుజువులతో సహా కోర్టును ఆశ్రయించటంతో ఈ ప్రతిపాదనపై కోర్టు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చింది. ఆ నాటి నుంచి పురపాలక సంఘానికి గానీ, గ్రామ పంచాయితీలకు గానీ ఎన్నికలు జరగలేదు., గద ఐదు సంవత్సరాలుగా పొన్నూరు పురపాలక సంఘం, ఆరు గ్రామ పంచాయితీలకు పాలకవర్గాలు లేకపోవటంతో ప్రజాపాలన పూర్తిగా కుంటుపడింది. అయితే విలీన గ్రామాలను పంచాయతీ రాజ్ నుంచి తొలగించారు. పురపాలక సంఘంలో సాంకేతికంగా కలవకపోవటం, పంచాయతీరాజ్ నుంచి తొలగించటంతో ప్రస్తుతం ఈ గ్రామాల పరిస్థితి త్రిశంకుస్వర్గంలా మారింది.

గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ అసంపూర్తిగా మారిపోవటంతో ఈ గ్రామాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. ఒక్క కసుక్రు పంచాయతీ మాత్రం గ్రామ పంచాయతీగానే ఉండిపోయింది. మిగిలిన చింతలపూడి, వడ్డిముక్కల, ఇట్టికంపాడు, ఆలూరు, కట్టెంపూడి గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు ఐదేళ్ల నుంచి రాకపోవటంతో ప్రగతి నిల్చిపోయింది. మరోవైపు పంచాయతీరాజ్ వ్యవస్థలో ఈ గ్రామాలు లేకపసోవటంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంను కూడా ఈ గ్రామాల నుంచి తొలగించారు. దీంతో గ్రామాలో ఉపాధి పనులు లేక కూలీలు ఆర్థికంగా నష్టపోవటంతో మౌలిక వసతుల కల్పనకు అవరోధం ఏర్పడింది. చింతలపూడి పంచాయతీలో 5,277మంది జనాభా ఉండగా ఏడాదికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం ద్వారా రూ. 23.74 లక్షలు పంచాయతీకి విడుదల చేయాల్సివుండగా ఆ నిధులను నిలిపివేసింది. అలాగే వడ్డిముక్కలలో 1566 మంది జనాభా ఉండగా రూ.7లక్షలు ఇట్టికంపాడులో 1092మంది జనాభా ఉండగా రూ.4.91 లక్షలు, ఆలూరులో 1761 మంది జనాభా ఉండగా రూ.7.92లక్షలు, కట్టెంపూడిలో 1972మంది జనాభా ఉండగా రూ.8.87 లక్షలు ఆర్థికసంఘం నిధులు ప్రతి ఏడాది రావాల్సివున్నాయి. అయితే ఐదేళ్లుగా ఈ నిధులు నిల్చిపోవటంతో గ్రామాలో ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం వంటి పనులు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి కూడా ఈ గ్రామానికి అరకొరగానే నిధులు మంజూరైయ్యాయి. కేవలం వైసీపీ ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయం కారణంగా ఐదేళ్లుగా పల్లెపాలన పడకవేసింది. గ్రామ పంచాయతీల దుస్థితిపై ఇటీవల ఆయా గ్రామాల వాసులు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాలలో కేవలం వసూళ్లయ్యే ఇంటి పన్నుల ఆధారంగా గ్రామ పంచాయతీలు మనుగడ సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కరెంటు బిల్లుతో పాటు పంచాయతీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు లక్షల్లో వేతనాలు పంచాయతీకి బకాయిపడ్డాయి. విలీన ప్రతిపాదిత పంచాయతీలను తిరిగి అభివృద్ధిబాట పట్టించాలంటే గ్రామ పంచాయతీలను పంచాయతీరాజ్ వ్యవస్థలోకి తీసుకురావాలని ఆయా గ్రామాలవాసులు పాలకులను వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా వైసీపీ పాలకులు మరో ముందుడుగువేసి ఈ పంచాయతీలో ఉన్న డ్వాక్రా పొదుపు సంఘాలను ఎటువంటి ఉత్తర్వులు లేకుండా పురపాలక సంఘం పరిధిలోని మెప్మా పరిధిలోని తీసుకెళ్లటం కూడా వివాదస్పదం అయింది.

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

జేసీ భార్గవ్ తేజ



రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తదితరులు

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్దేశించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. పొన్నూరు పట్టణంలోని రెండు సీఎంఆర్ రైస్ మిల్లులను శుక్రవారం జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సేకరించిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు మాట్లాడుతూ పొన్నూరు మండలంలో పది సీఎంఆర్ రైస్ మిల్లుల ద్వారా ధాన్యం సేకరణను చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రైతుల నుంచి 8వేల క్వింటాలు ధాన్యం కొనుగోలు జరిపినట్లు వివరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు వివరించారు. 75కిలోల బస్తా గ్రేడ్-1 రూ.1740 మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతుల ధాన్యంను కొర్రీలు వేయకుండా చూడాలని ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలుపై ఆరా తీయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్స్ సప్లయిస్ అధికారి కోమలి పద్మ, పొన్నూరు తహసీల్దార్ జియావులల్ హక్ తదితరులలు పాల్గొన్నారు.

● చేబ్రోలు: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ ఆదేశించారు. శుక్రవారం చేబ్రోలులోని రైతుల ధాన్యంను జేసీ పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు జరిగేలా జాగ్రత్తలు పాటించాలని సచించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం కొనుగోలుకు సడలింపులు ఇచ్చిన నేపథ్యంలో రైతులు నష్టపోకుండా దళారుల పాలు కాకుండా ధాన్యం మొత్తం రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదు

● లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు



ల్యాప్‌టాప్‌ను పంపిణీ చేస్తున్న పిల్లి మాణిక్యరావు తదితరులు

పెదకాకాని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదని, ప్రతిభ గల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు పేర్కొన్నారు. శుక్రవారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో పిల్లి మాణిక్యరావు పాల్గొని ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, అనుభవం, ప్రతిభ గల ఉపాధ్యాయులు, విశాలమైన క్రీడా ప్రాంగణాలతో ఉండగా మరోవైపు కార్పొరేట్ విద్యా సంస్థలు కనీస వసతులు లేకుండా అతి తక్కువ వేతనాలతో అధ్యాపకుల సేవలను వినియోగిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని, కొమ్మాలపాటి శ్రీనివాసరావు లాంటి దాతలు ముందుకొచ్చి ప్రతిభగల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించటం అభినందనీయమన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ప్రవేశపెట్టిన పి4 భావనను వివరిస్తూ పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ ద్వారా విద్య వైద్య రంగాలతో పాటు రాష్ట్ర అభివృద్ధిని సాధించగలమన్నారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనానికి తోడ్పడే షెడ్ నిర్మాణానికి కొమ్మాలపాటి శ్రీనివాసరావు ముందుకు రావడం హర్షణీయమన్నారు. బీటెక్ చదువుతున్న ప్రతిభగల పేద విద్యార్థిని వజ్రాల తనుశ్రీకి కొమ్మాలపాటి శ్రీనివాసరావు తండ్రి కొమ్మాలపాటి హరికోటేశ్వరావు జ్ఞాపకార్థం ల్యాప్‌ట్యాప్‌ను బహూకరించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ గత రెండు సంవత్సరాలుగా తమ సంస్థ 200కు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొందన్నారు. గతంలో ఇదే హైస్కూల్‌కు వారు అందించిన సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు, ఆత్మకూరి ధర్మారెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, టి.ధనుంజయరెడ్డి, వర్రె సుబ్రహ్మణ్యం, ఆలా అనంతరామయ్య, కె.శంకర్రావు, సీహెచ్ శివాజీ, కె.ఆనంద్ తదితరులు ప్రసంగించారు.

మెప్మా మార్కెట్లలో నాణ్యమైన ఉత్పత్తులు

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెప్మా మార్కెట్ల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరలకే వినియోగదారులకు అందించేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు ద్వారా విక్రయాలు జరుపడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం మార్కెట్ సెంటర్‌లో మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ మెప్మా గ్రూప్ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో మెప్మా ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన మరింత మెరుగు పడేలా కృషి చేయనున్నట్లు కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. మెప్మా అర్బన్ మార్కెట్‌లను ప్రతినెల రెండు రోజులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయకుమారి, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప దర్శనానికి వెళ్లి అనంత లోకాలకు



వేల్పూరి వెంకయ్య (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దర్శనానికి శబరిమలై వెళ్లిన గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన వేల్పూరి వెంకయ్య (65) గుండెపోటుతో మృతి చెందాడు. వేల్పూరి వెంకయ్య అయ్యప్ప దీక్ష తీసుకొని ఈ నెల 26వ తేదీన పది మందితో కలసి శబరిమలై బయల్దేరి వెళ్లారు. అయితే శబరిమల కొండను ఎక్కుతున్న సమయంలో వెంకయ్యకు బుధవారం చాతినొప్పితో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం సిబ్బంది, స్థానికులు వెంకయ్యను పంబ బేస్ క్యాంప్‌లో ఉన్న ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించటంతో వెంకయ్య చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు వెంకయ్యకు భార్య వెంకట రమణ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను సంప్రదించారు.వెంకయ్య మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నరేంద్ర కుమార్ కేరళ ప్రభుత్వ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంకయ్య మృతదేహాన్ని పొన్నూరు తరలించేందుకు వాహన ఏర్పాట్లను చేయించారు. వెంకయ్య మృతదేహం శుక్రవారం రాత్రికి గ్రామానికి చేరుకునే అవకాశం ఉందని బంధువులు వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. స్థానిక నాజరుపేటలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక భూమిపూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా నూతన రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అందులో భాగంగా మహాలక్ష్మమ్మచెట్టు గుడినుంచి మేడిశెట్టి వారి వీధివరకు 114 మీటర్లు రూ.12.35 లక్షలతో ప్రారంభించామని తెలిపారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తను పూర్తిగా తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఉన్న చెత్తను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు చెత్తను వ్యర్థాలను డ్రెయిన్‌లు, రోడ్లపై వేయరాదని అన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, కాలుష్య రహిత సమాజాన్ని సాధించవచ్చన్నారు. సుందర తెనాలికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి: ఎంపీడీవో

కొల్లిపర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. సచివాలయం సిబ్బందిచే నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

జాబ్‌మేళాలో 27మంది ఎంపిక

చేబ్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని చేబ్రోలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం చేబ్రోలు డిగ్రీ కళాశాలల్లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 41 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపికల్లో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా 27మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ఈశ్వరరావు, స్కిల్‌హబ్ నిర్వాహకులు హనుమంతరావు, కో ఆర్డినేటర్ రామ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు కృష్ణదాస్ అరెస్టు దారుణం

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు కృష్ణదాసును బంగ్లాదేశ్ ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేయటం దారుణం అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వరరావు శుక్రవారం అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై దాడులు నిర్వహించటం ధ్వంసం చేయటం హేయమైన చర్య అన్నారు. అంతేకాకుండా కృష్ణతత్వాన్ని ప్రచారం చేస్తున్న కృష్ణదాసుపై దేశ ద్రోహం నేరం ఆరోపించి బెయిల్ రాకుండా ఆరెస్టు చేయటం అప్రజాస్వామికం అని ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకొని కృష్ణదాసును విడిపించాలని కోరారు. అలాగే మాజీ అధ్యక్షురాలు షేక్ హసీనా మద్దతు దారులపై బంగ్లాదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలు ఖండించాలని కోరారు.

బ్యాంకింగ్ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన

తెనాలి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శుక్రవారం బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు హైస్కూల్ విద్యార్థులను ఉపాధ్యాయులు బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖకు తీసుకువెళ్లారు. సమగ్ర శిక్షా అభియాన్ నిర్వహిస్తున్న వృత్తివిద్యా కోర్సులలో భాగంగా విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. బ్యాంకు అందిస్తున్న వివిధ సేవలను, డిపాజిట్లను, లోన్‌శాంక్షన్, విత్‌డ్రాయల్, చెక్కు, డ్రాఫ్ట్, అకౌంట్ ఓపెనింగ్, ఏటీఎం తదితర అంశాలను మేనేజర్ నవజ్యోతి, సిబ్బంది విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం అనూరాధ, ఉపాధ్యాయులు యోహాను, సత్యకళ, సాగర్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

శైవాలయాల్లో కర్పూర జ్యోతి ప్రజ్వలనం

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా పొన్నూరు, పరిసర ప్రాంతాలలోని ప్రముఖ శైవాలయాల్లో ప్రత్యేక పూజలు కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. పట్టణంలోని నిడుబ్రోలు రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఉన్న అగస్తీశ్వర స్వామి ఆలయంలో కోటి ఒత్తుల దీపారాధన, కర్పూర జ్యోతి ప్రజ్వలనం జరిగింది. చింతలపూడిలోని మల్లేశ్వరస్వామి ఆలయం, మామిళ్లపల్లిలోని అగస్తీశ్వరస్వామి ఆలయంలో కర్పూరజ్యోతి ప్రజల్వన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజాధికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వధార్ హోమ్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జేఎంజే కళాశాల అనుబంధ సంస్థ స్వధార్ హోమ్‌లో శుక్రవారం అన్నదానం చేశారు. ప్రవాస భారతీయుడు కొత్తపల్లి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మొవ్వా సునీల్ వర్థంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్‌జోన్ చైర్మన్ ఈదర వెంకటపూర్ణచంద్, శివప్రసాద్, రామకృష్ణ, శివతేజ తదితరులు పాల్గొన్నారు.



చీటీల నగదు ఎగవేతపై కేసు

తెనాలి క్రైమ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీటీల నగదు ఎగవేత దారులపై కేసు నమోదు చేసినట్లు ఒన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానిక రామలింగేశ్వరపేటకు చెందిన ఉప్పు శ్రీనివాసరావు తన బంధువుల ద్వారా పరిచయం అయిన విజయవాడకు చెందిన చీటీ పాట నిర్వాహకులు గోగుల శ్రీనివాసరావు, కిలారి సతీష్‌కుమార్‌లకు 2019లో రూ.5లక్షలు, రూ .10లక్షలు చీటీలుకట్టారు. ఆ పాటల సొమ్మును సకాలంలో చెల్లించారు. తిరిగి 2020లో రూ.5లక్షలు, రూ.10లక్షల పాటలకు నగదు చెల్లించారు. రెండోసారి చీటీ పాటల నగదు చెల్లించకుండా బెదిరింపులకు దిగటంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

పొన్నూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. సుమారు 70ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తునాడు. శుక్రవారం ఈ వృద్ధుడు మృతదేహాన్ని బ్రిడ్జిపై గమనించిన స్థానికులు పోలీసులకు సమాచరం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి ఉండాలన్నదే లక్ష్యం

● మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి





కొల్లిపర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తప్పనిసరిగా మరుగు దొడ్డి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని... పేద ప్రజలు మరుగుదొడ్డి నిర్మించుకోవటానికి ప్రభుత్వం మరొక అవకాశం కల్పించిందని మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం ఆంధ్రజ్యోతికి వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటే అర్హత ఏమిటి ?

జవాబు: తెల్లరేషన్ కార్డు ఉండి, ఇంట్లో మరుగుదొడ్డి లేని వారు అర్హులు.

ప్రశ్న: ఇంటి సమీపంలో ఎక్కడైనా నిర్మించుకోవచ్చా ?

జ: కొంత మంది బెడ్‌రూమ్‌లో మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తున్నారు. వారికి ఎట్టి పరిస్థితుల్లో నగదు జమ కాదు. ఇంటి బయట కట్టుకున్నవారికి మాత్రమే బ్యాంకులో నగదు జమ అవుతుంది.

ప్రశ్న: మరుగుదొడ్డి నిర్మించుకుంటే ప్రభుత్వం ఎంత మంజూరు చేస్తుంది ?

జ: మరుగుదొడ్డి నిర్మించుకున్న లబ్ధిదారుల ఖాతాలో రూ.12వేలు జమవుతాయి.

ప్రశ్న: బహిరంగ మలవిసర్జనపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: పంచాయతీ కార్యదర్శులకు తగినచర్యలు తీసుకోవాలని సూచనలిచ్చాం. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైకులో ప్రచారం చేయడంతో పాటు ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: పంచాయతీ కార్మికులు ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద తయారు కేంద్రానికి తరలిస్తున్నాం.

ప్రశ్న: చెత్త సంపద కేంద్రాలన్నీ గ్రామాల్లో ఉన్నాయా ?

జ: మండలంలో 17గ్రామాలు ఉన్నాయి. 3 గ్రామాల్లో నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి, ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జ: దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతోపాటు మలాథిన్ స్ప్రే చేయిస్తున్నాం. మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్, మడ్డి ఆయిల్ వేయిస్తున్నాం.

భ్రమరాంబసమేత మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్షబిల్వార్చన పూజల్లో భక్తులకు దర్శనమిస్తున్న మల్లేశ్వరస్వామి

తెనాలి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చిన మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని కఠెవరంలోని భ్రమరాంబసమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకస్వాములు ప్రతాప్‌రుద్రశర్మ స్వామి వారికి మహన్యాస పూర్వ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు జరిపి భక్తుల గోత్రనామాలతో విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరాజు, సభ్యులు వెంకటరమణ, వెంకమరాజులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో భక్తులు లక్కరాజు మురళి, వెంకట ఉమాకాంత్, శ్రీనివాస్, నటరాజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి కార్తీకమాస ప్రత్యేక పూజలు



సాలిగ్రామ మఠంలో 108 కేజీల అన్నంతో లింగాకృతిలో స్వామివారికి ప్రత్యేక పూజలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మాసశివరాత్రి సందర్భంగా చంద్రమౌళీశ్వర స్వామివారికి శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శుక్రవారం శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలస్వామివారి స్వయం పర్యవేక్షణలో చంద్రమౌళీశ్వర స్వామివారికి మాసశివరాత్రి పర్వదినం పురష్కరించుకొని ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, రుద్రాభిషేకం, 108 కేజీల అన్నాభిషేకంను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సూబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: మారీసుపేట శివాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని శుక్రవారం మాస శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. బాలత్రిపురసుందరి అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు చేశారు.

● తెనాలి, మారీసుపేట: కొండవీటి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన సందడి వాతావరణంలో జరిగింది. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం కొండవీటి సేవా సమితి అధ్యక్షుడు పేరం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన మకొండవీటి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన సందడిగా జరిగింది.

● తెనాలి అర్బన్: సుప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి శత జయంతి సభ ఆదివారం కవిరాజా పార్కులో నిర్వహిస్తున్నారు. అరసం ఆధ్వర్యంలో నిర్వహించే సభలో అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వల్లూరు శివప్రసాద్ పాల్గొంటారని సాహిత్యవేత్తలు జయప్రదం చేయాలని జిల్లా అరసం అధ్యక్షుడు సింగారావు కోరారు.